# ద్రమిడోపనిషత్సంగతి

# అళగియ మణవాళ జీయర్

( శ్రీవాది కేసరి ఉపోద్ఘాత శ్లోకములు.)

## మనకు భాగవత మైత్రి-వాట్సాప్ సమూహం ద్వారా అందించిన వారు

శ్రీమాన్ దరూరి. నరసింహాచార్యుల వారు.

ప్రియ భాగవతోత్తములారా! నమ్మాళ్వారులు అనుగ్రహించిన సామవేదసారభూతమైన తిరువాయ్ మొళి దివ్యప్రబంధము శ్రీవైష్ణవులందరికి నిత్యానుసంధేయమైయున్నది.భక్తి జ్ఞాన వైరాగ్యసంపన్నులైన పూర్వాచార్యులొకరు తిరువాయ్ మొళిని అనుసంధానము చేయనిదే సాపాటుచేసేవారు కాదట.తిరుక్కార్తి సమయమునందు ప్రబంధానుసంధానముండదు.కనుక వారు తిరుక్కార్తి అంతయు ఉపవాసముండేవారు.అప్పుడు శ్రీవరవరమునులు తిరువాయ్ మొళి ప్రతి దశకమునకు ఒక పాశురమును అనుగ్రహించిరి.దానిని తిరువాయ్ మొళి నూత్తాది అనిఅందురు.దానిని అనుసంధానము చేసినచో మొత్తము తిరువాయ్ మొళిని అనుసంధానము చేసినట్లే.తిరుక్కార్తిలో దీనిని అనుసంధానము చేయవచ్చును.అట్లే శ్రీవాదికేసరి(అళగియమణవాళ జీయర్)మహానుభావులు ద్రమిడోపనిశత్సంగతి అను పేరుతో ఒక్కొక్క దశకసారాంశమును ఒక శ్లోకముగా నూరుశ్లోకములను అనుగ్రహించిరి.ఇది తిరువాయ్ మొళి సారాంశమును నిత్యము అనుభవించుటకు వీలుగానున్నది.ఆశ్లోకముల అర్థవిశేషములను సరళంగా అందరికి అవగతమయ్యేరీతిలో అందించడానికి ప్రయత్నిస్తాను.పెద్దలు అనుగ్రహిస్తారని భావిస్తున్నాను.

శ్రీమతే శఠకోపాయ నమః

శ్రీమతే రామానుజాయ నమః

# ద్రమిడోపనిషత్సంగతి

# అళగియ మణవాళ జీయర్

## ( శ్రీవాది కేసరి ఉపోద్ఘాత శ్లోకములు.)

1.య శ్చకార సకలార్థసంపదాం
వ్యంజనీం ద్రమిడ వేదసంగతిం
తం ద్వితీయశఠకోప మన్వహం
స్తౌమి సుందరవరాహ్వయం మునిం॥

తా॥తిరువాయ్ మొళి సమస్త అర్థములను ప్రకాశింపచేసిన ట్టి "ద్రమిడోపనిషత్సంగతి" అను గ్రంథమును అనుగ్రహించిన మహనీయులు అళగియ మనవాళ జీయర్.వారిని రెండవ శఠకోపమునీంద్రులని అంటారు.వారిని నేను ప్రతిదినము స్తోత్రము చేయుచున్నాను.

2.ఆచార్యోదిత పద్ధత్యా
ద్రామిడామ్నాయ సంగతిం
అభిధాస్యే విశేషజ్ఞై-
రాదరా ద్గృహ్యతా మియం॥

తా॥వేదాంతార్థమును చెప్పుచున్నప్పుడు పూర్వాచార్య పద్ధతినే అనుసరించవలెను.భగవద్రామానుజ స్వామి బ్రహ్మసూత్రవ్యాఖ్యానం చేస్తూ "అథ భగవద్బోధాయన కృతాం విస్తీర్ణాం బ్రహ్మసూత్రవృత్తిం పూర్వాచార్యాః సంచిక్షిపుః తన్మతానుసారేణ వ్యాఖ్యాస్యంతే" అంటారు.అనగా పూర్వాచార్యపద్ధతిలోనే వ్యాఖ్యానిస్తున్నానని అర్థము.అట్లే ద్రావిడవేదము భక్తామృతము సర్వార్థదము ఐన నమ్మాళ్వారుల తిరువాయ్ మొళి సారార్థమును "ద్రమిడోపనిషత్సంగతి" పేరుతో నాథ యామున పూర్వాచార్యాది ప్రభృతుల పద్ధతిని అనుసరించి చెప్పబోవుచున్నానని శ్రీవాదికేసరి అళకియ మనవాళ జీయర్ స్వామి తెలియచేయుచున్నారు.విశేషార్థ జిజ్ఞాసువులు దీనిని శ్రద్ధగా అనుసంధించవలెనని వారు కోరుచున్నారు.

3.శ్రీమాన్ గుణాంబుధి వార స్తమస్తకామ
శ్శౌరి శ్శఠారి మనుజన్మ పరిభ్రమంతం।
ఆకస్మికేక్షణవశా దతినిత్యముక్తం
బృందా తృణీ కరణ శక్తిధరశ్చకార॥

తా॥శ్రియఃపతి సమస్త కళ్యాణగుణగణ మహోదధి,అవాప్తసమస్త కాముడు,పల్లేరు కాయల అడవిని నందనవనముగా చేయకల అఘటనాఘటన దురంధరుడు సర్వసమర్థుడు.అతడే శ్రీకృష్ణుడుగా అవతరించినాడు.ఆ శ్రీకృష్ణుడు జన్మపరంపరలో తిరుగాడుచున్న నమ్మాళ్వారులను తన నిర్హేతుక కృపాకటాక్షముచేత నిత్యసూరుల ముక్తుల కంటె ప్రభావసంపన్నునిగా చేసెను.

విశేష వివరణ=మన సిద్ధాంతమున లక్ష్మీవిశిష్టుడైన శ్రీమన్నారాయణుడే ఆశ్రయణీయుడు.ఆయనను శ్రియఃపతియని పిలుస్తారు.మహాలక్ష్మీ తాయారు పుషకారస్వరూపిణి.నిత్యానపాయినియగు అమ్మ పురుషకారప్రభావము వలననే సాపరాధులైన జీవులను స్వామి రక్షించును.శ్రియఃపతి శ్రీమన్నారాయణుడు సమస్త కళ్యాణగుణగణ సముద్రుడు. హేయ

4.ఆద్యే వయస్యపి తతోనుభవన్మురారి
మ స్తన్యపాన రసిక శఠజిన్మునీంద్రః
ఆస్థాయ మౌన మనధీర్య చ లోకవృత్త
మాషోడశాబ్ధ మతివాహితవాన్దినాని॥

తా॥పాపండమతములను జయించిన పరాంకుశమునివర్యులు తమ బాల్యమునందే స్తన్యపానమును వదలిపెట్టి మౌనము వహించి భగవంతుడైన శ్రియఃపతిని ధ్యానముచేయుచున్నవారై ఇంద్రియములను జయించి పదునారు వత్సరములు గడపిరి.

విశేష వివరణ

నమ్మాళ్వారుల అవతారము వారి జీవనము ఒక అద్భుతము.ఎవరైనను ఈభూమిపై పుట్టగానే శఠమనే వాయువు ఆవరించడం వలన అజ్ఞానమునకు అవిద్యకు వశమయ్యేదరు.బ్రహ్మజ్ఞానము లోపించును.కాని నమ్మాళ్వారులు పుట్టగానే శఠమనే వాయువును జయించి శఠకోపులని ప్రసిద్ధి వహించినారు.వారు ఎల్లప్పుడు బ్రహ్మజ్ఞానసంపన్నులైయుండిరి.అందరివలె వారు స్తన్యపానము నాశించలేదు.వారు అవతరించుటకు ముందే ఆదిశేషుడు తింత్రిణీవృక్షముగా అచ్చట వేంచేసియున్నారు.ఆళ్వారులు పుట్టినది మొదలు పదునారుసంవత్సరములవరకు ఆతింత్రిణీవృక్షమూలమన మౌనము వహించి శ్రీమన్నారాయణుని ధ్యానము చేయుచు లౌకికవ్యాపారముల నెల్ల విడిచి కాలము గడిపారు.వారు జీవించియున్న మిగతా పదునారు వత్సరములకాలము నాలుగు వేదముల సారభూతముగా నాలుగు దివ్యప్రబంధములను అనుగ్రహించినారు.ఆతరువాత శ్రీమన్నారాయణుని పరిపూర్ణకృపాకటాక్షముచే భౌతికశరీరముతోనే పరమపదమునకు వేంచేసినారు.కనుకనే అన్ని శ్రీవైష్ణవ దేవాలయాలలో ఆళ్వారుల ప్రబంధ అధ్యనము నమ్మాళ్వారుల పరమపదుత్సవము ఘనముగా నిర్వహించెదరు.భగవద్విషయమును తాము సంపూర్ణముగా అనుభవించి తమదివ్యప్రబంధములద్వారా మనకు అందించిన పరమోపకారకులు మన ఆళ్వారులు నమ్మాళ్వార్.

## 5.యేరాఘవే భరత లక్ష్మణ జానకీనాం

## యే ఘోష ముగ్ధ సుదృశా మపి నందసూనౌ

## భావా రసైకవపుషః ప్రథితా శ్శఠారి-

## స్తానేన వా తదధికా నుత తత్ర లేభే॥

తా॥భరతాళ్వారుకు లక్ష్మణ స్వామికి సీతాపిరాట్టికి చక్రవర్తి తిరమగనార్ నందు,గోపికలకు నందనందనుడగు శ్రీకృష్ణ పరమాత్మయందును నెట్టి భక్తిప్రపత్తులు కలవని లోకమున ప్రసిద్ధిచెందియున్నవో భక్తిశృంగారాది రసములను దివ్యశరీరముగాకల అట్టి మధుర భావములను కాని,లేక వానికి మించిన భగవద్విషయ భావములను కాని ఆ శ్రియఃపతి శ్రీనివాసునియందు నమ్మాళ్వారులు పరిపూర్ణముగా పొందకలిగిరి.

6.ప్రహ్లాద నారద ముఖప్రభవా  చ భక్తిః
స్నేహస్తథా దశరథార్జున బాంధవోత్థః
సర్వే చ తే శఠజితః పురుషే పరస్మిన్
ఆనందనే పదజుషా మతి మాత్ర మాసన్॥

తా॥పరమపురుషుని భక్తిసాగరమునందు మునకలేసి తదనుభవమును ద్రావిడవేదరూపమున మనకు అందించిన మహనీయులు మన నమ్మాళ్వార్.ప్రహ్లాద నారదాదులకు శ్రీహరియందు ఏర్పడిన భక్తి నిరుపమానము.ఇక  దశరథార్జున బాంధవులకు సర్వేశ్వరునియందు ఏర్పడిన గాఢమైన ప్రీతి అనురాగము   మెండు.ఇట్టి భగవద్విషయమధుర భావములన్నియు తనపాదపద్మములను ఆశ్రయించినవారికి అతృప్తానందము ప్రసాదించు శ్రియఃపతి శ్రీమన్నారాయణునియందు మన నమ్మాళ్వారులకు అధికముగానుండెను.అందుకే వారికి కృష్ణతృష్ణాతత్త్వమని పేరు.

7.ఇత్థం హరే రనుభవామృతవారి రాశి
రంత ర్మునే శ్శఠరిపో రమిత శ్శరీరే
సూక్త్యా బహిః పరివహ న్నుతరాం జగంతి
పద్య స్స్రషే చ ఘన సంసరణానలాని॥

తా॥శ్రియఃపతి యొక్క భగవద్విషయ అనుభవమనెడు అద్భుత అతృప్తామృత సముద్రము లో ఓలలాడిన నమ్మాళ్వారులకు హృదయమునందు అణగినదై బయటకు దివ్యమైన పాశురములద్వారా ప్రవహించినదై మిక్కిలి దుర్భరమైన సంసారాగ్ని కల లోకములను తడిపి చల్లార్చివేసెను.

సంస్కృతవేదమువలె ద్రావిడవేదముకూడ అపౌరుషేయము. నమ్మాళ్వారుల అంతరంగమునందు అణగినదై అప్రయత్నముగా సర్వేశ్వరుని అనుగ్రహముచే ఈ ద్రావిడవేదము బయటకు ప్రవహించినది.సంస్కృత వేదమెట్లు  సర్వార్థదమో నమ్మాళ్వారుల ద్రావిడవేదము భగవంతునకు అత్యంతప్రీతికరమైనదగుటచే సర్వార్థదము సర్వఫలప్రదమైయున్నది.

8.మాతా పితృ ప్రభృతితోపి చ వత్సలత్వా-

త్సర్వోపకార చపలా చ్చఠ జిన్మునీంద్రాత్

వేద శ్చతుర్విధతయా విదిత స్ససాక్షా

దావిర్బభూవ హి నిబంధచతుష్ట యాత్మా॥

తా॥వేదము మాతాపితరులు మొదలుకొని అందరికంటెను ప్రేమ కలిగినట్టిది.సమస్త చేతనోపకారకమైనట్టిది.అట్టి వేదము శఠకోపమునీంద్రుల ద్వారా నాలుగు దివ్యప్రబంధములుగా నాలుగు విధములుగా ఆవిర్భవించినది.

వేదము అపౌరుషేయము.పరమపురుషుడైన శ్రియఃపతిని ప్రతిపాదించునవి.వేదరాశిని వేదవ్యాసుడు ఋుక్,యజుర్,సామ,అధర్వణ వేదములుగా విభజించెను.సనాతనమైన ఈవేదము మాతాపితరులు మొదలుకొని అందరికంటెను మనపైన వాత్సల్యము కలిగినట్టిది. సమస్తచేతనోజ్జీవనమునకు ఉపయోగపడును.అట్టి వేదము భగవంతుని కృప వలన శఠకోపమునీంద్రుల ద్వారా నాలుగు దివ్యప్రబంధములుగా ఆవిర్భవించినది.అవి1)తిరువాశిరియం2)తిరువిరుత్తం3తిరువాయ్ మొళి4)తిరువందాది.ఇందులో తిరువాయ్ మొళి పరమాత్మకు ప్రీతికరమైన సామవేదరూపము.

సంస్కృతవేదమునందు అందరికి అధికారము లేదు.నమ్మాళ్వారులనుండి ఆవిర్భవించిన ద్రావిడవేదమునందు ఇచ్ఛకలిగినవారందరికి అధికారము కలదు.

9.శబ్దస్య సంస్కృతతయా యది గౌరవం స్యాత్

బౌద్ధాదిశాస్త్రవచసా మపి తత్ప్రసంగః

వాచ్యేన చే త్కథిత ముత్తమ వాచ్యమేషు

భాషానికర్ష ఇహ తేన న శక్యశంకః॥

తా॥సంస్కృత భాషనుబట్టి గౌరవమన్నచో అవైదికములగు బౌద్ధ పాశుపతాది విషయములకు గౌరవముండవలెను.కాని వైదికులెవ్వరు వానిని అంగీకరించరు.అర్థమునుబట్టి గౌరవమన్నచో కేవలభగవద్విషయమును తప్పఅన్యవిషయములను ప్రస్తావించని ద్రావిదవేదమునకే అధికగౌరవమున్నది.కనుక గౌరవము భాషనుబట్టికాక ప్రతిపాదించిన భగవద్విషయమునుబట్టియేఅని గ్రహించవలెను.అళకియ మనవాళ జీయర్ స్వామివారు ఈశ్లోకమునందు ద్రావిడవేదమునకు భాషనుబట్టి ఎట్టి న్యూనతలేదని భగద్విషయమును బట్టి అత్యంతఆదరణీయమైనదని ప్రతిపాదించినారు.కనుకనే భగవద్రామానుజీయ

శ్రీవైష్ణవులను ఉభయవేదాంత ప్రవర్తకాచార్యులని అంటారు.ప్రతిపాదిత భగద్విషయమునుబట్టి ద్రావిడవేదమునకు అత్యంతగౌరవము ఇవ్వబడినది.ప్రతివైష్ణవునకు ద్రావిడవేదము నిత్యానుసంధేయమైయున్నది.

10.పుంస్త్వం నియమ్య పురుషోత్తమతా విశిష్టే

స్త్రీప్రాయ భావకథనా జ్జగతోఖిలస్య

పుంసాం చ రంజకవపు ర్గుణవత్తయాపి

శౌరే శ్శఠారియమినోజని కామినీత్వమ్॥

తా॥భగవంతుడైన శ్రియఃపతి శ్రీమన్నారాయణుడే పురుషుడు పురుషోత్తముడు."స్త్రీప్రాయ మితరం జగత్" అని సమస్త జగత్తు స్త్రీప్రాయమైనది.పతిం విశ్వస్యయని సర్వజగన్నాథుడు భగవంతుడైన నారాయణుడే.సకలభువనములను మోహింపచేయకలిగిన దివ్యమంగళవిగ్రహసౌందర్యము కలిగినవాడు సర్వేశ్వరుడు. పుంసాం మోహనరూపాయ అని పురుషులగు చేతనులను కూడ మోహింపచేయకల దివ్యసౌందర్యము స్వామిది.కనుకనే పరమ భక్తి జ్ఞాన వైరాగ్యసంపన్నులైన నమ్మాళ్వారులు పరమపురుషుని నాయికాభావముతో అనుభవించిరి.

11.యా ప్రీతి రస్తి విషయే ష్వవివేక భాజాం

సై వాచ్యుతే భవతి భక్తిపదాభిధేయా

భక్తిస్తు కామ ఇహ తత్కమనీయరూపే

తస్మాన్మునే రజని కాముక వాక్య భంగీ॥

తా॥వివేకహీనులకు సాంసారిక భోగములవలన కలిగిన సంతోషమే భగవద్భక్తిగా తోచుచున్నది.మన నమ్మాళ్వారులకు శ్రియఃపతి శ్రీమన్నారాయణుని జగన్మోహనాకారమగు దివ్యమంగళ విగ్రహమునందలి భక్తియే కామముగా రూపొందినది.కనుకనే ఆళ్వారులకు కాముకుల వాక్యములు పుట్టినవి.ఆళ్వారుల సుమధరవాక్యములు చేతనోజ్జీవనకారకములు.అవి అభ్యుదయ నిశ్శ్రేయసములను సాధించునవి.

12.య శ్చేతస ఇవ విషయానుభవః పరస్మిన్
సంశ్లేష ఏష గుణరత్నమహాంబురాశౌ
విచ్ఛిత్తి రస్య విరహ స్త్వహ యాంగసంగా
లాభవ్యథావిరచితా మునిపుంగవస్య॥

తా॥సమస్త కళ్యాణగుణగణములనెడు రత్నములకు సముద్రము వంటివాడు సర్వేశ్వరుడు శ్రియఃపతి.ఆ పరమపురుషుని నిర్మలమైన మనస్సుచేత సాక్షాత్కరించుకొనుటయే నమ్మాళ్వారులకు భగవత్సంశ్లేషము.శ్రీమన్నారాయణుని దివ్యమంగళవిగ్రహముతో బాహ్యసంశ్లేషము లభించనందున ఏర్పడిన తీవ్రమైన దుఃఖముచే కలిగినట్టి మానసిక సాక్షాత్రారము యొక్క నాశమే వీరికి విశ్లేషమనబడుచున్నది.

13.తత్రార్థయద్భవశమం ప్రథమే ప్రబంధే
శౌరేర్గుణం శఠజిదన్వభవ ద్ద్వితీయే
తృష్ణా మవర్ధయత భోక్తు మిమం తృతీయే
యావన్మనోరథ మలబ్ధ ఫలం చతుర్థే॥

తా॥నమ్మాళ్వారుల నాలుగు దివ్యప్రబంధముల సారమును శ్రీ అళకియ మనవాళ జీయర్ స్వామివారు ప్రత్యేకముగా ఒక్కొక్క వాక్యముగా అనుగ్రహించినారు.

భగవద్విరహావస్థయందున్న శఠకోపమునీంద్రులు తమ “తిరువిరుత్తం” అను మొదటి దివ్యప్రబంధములో తమకు సంసారబంధము వలదని భగవంతుని ప్రార్థించిరి.”తిరువాశిరియం” అను రెండవ దివ్యప్రబంధమునందు శ్రియఃపతి శ్రీమన్నారాయణుని సౌలభ్య సౌశీల్యాది గుణములను ప్రస్తుతించిరి.మూడవదైన “పెరియ తిరువందాది అను దివ్యప్రబంధమునందు సర్వేశ్వరుడైన శ్రియఃపతిని అనుభవించుటలో తమకు కల ఆశను వృద్ధిపొందించుకొనిరి.ఇక నాలుగవదియగు సామవేదసారభూతమగు అతిప్రధానమైన తిరువాయ్ మొళి అను దివ్యప్రబంధమునందు తాము అభిలషించిన విధముగా పరమపురుషార్థమైన మోక్షఫలమును పొందిరి.

14.కైంకర్యమస్య నియమావధి వైర్యుపాయ

తతీస్స్వక్రియా విషయబాధ నిరాశతే చ

శీలం హరే రధిగతాధిగమం శఠారి

స్తుర్యప్రబంధశతకై ర్దశభి ర్జగాద ॥

తా॥అళకియ మనవాళ జీయర్ స్వామి వారు తిరువాయ్ మొళి లోని పది పత్తుల సారమును సంగ్రహముగా అనుగ్రహించినారు.

ఆళ్వారులు మొదటి పత్తు నందు భగవత్కైంకర్యమును,రెండవ పత్తునందు ఆ కైంకర్యము పరార్థమే కావలెనని,మూడవ పత్తునందు భగవత్ శేషత్వ పారతంత్ర్యములు భాగవత పర్యంతమైయుండవలెనని,నాల్గవ పత్తునందు ఫలవిరోధియైన విషయసౌఖ్యమును,ఐదవ పత్తునందు సిద్ధోపాయ స్వీకారమును,ఆరవ పత్తునందు సుఖప్రదమైన సిద్ధోపాయ స్వీకారావసరమును,ఏడవ పత్తునందు భగవద్విశ్లేషవ్యధను,ఎనిమిదవ పత్తునందు నిరాశా నిస్పృహలను,తొమ్మిదవ పత్తునందు భగవత్ప్రభావమును అనుగ్రహమును,పదవ పత్తునందు తాము పొందిన పరమపదవైభవమును క్రమముగా అనుగ్రహించినారు.

ఈ పదునాలుగు శ్లోకములను అళకియ మనవాళ జీయర్ స్వామి వారు ద్రమిడోపనిషత్సంగతిలో ఉపోద్ఘాత రూపముగా అనుగ్రహించినారు.

ఆళ్వార్ ఎంబెరుమానార్ జీయర్ దివ్యతిరువడిగళే శరణం.

## మొదటి పది మొదటి తిరువాయ్ మొళి “ఉయర్వర ” సారాంశము

15.తత్రాదిమే తు శతకే తదాద్యే

సమ్యగ్గుణాకృతి విభూతి సమేత మీశం

అధ్యక్షయన్ పరమనుగ్రహతస్తదీయా

త్తదాస్యయోజితమనా శఠజి ద్బభూవ ॥

తా॥తిరువాయ్ మొళి మొదటి పది మొదటి దశకమునందు స్వామి నమ్మాళ్వారులు సమస్త కళ్యాణగుణగణ స్వరూపరూపవిభవాదులతో కూడియున్న శ్రియఃపతి శ్రీమన్నారాయణుని సాక్షాత్కరించుకొని ఆ భగవంతుని నిర్హేతుకకృప వలన ఆస్వామి యొక్క కైంకర్యమునందే లగ్నమైన మనస్సు కలవారైరి.

విశేష వివరణ=శ్రయఃపతి,అవాప్త సమస్తకాముడు,సమస్తకళ్యాణగుణగణాకరుడు అగు సర్వేశ్వరుడు సంసారపరంపరలో తిరుగాడుచున్న ఆళ్వారులపై తన నిర్హేతుకకృపను ప్రసరింపచేసినారు.తత్ప్రభావముచే ఆళ్వారులు మొదటి తిరువాయ్ మొళిలో సర్వేశ్వరుని కళ్యాణగుణయోగమును నిత్యవిభూతియోగమును,దివ్యమంగళవిగ్రహవైలక్షణ్యమును చెప్పిరి.పరమాత్మ దివ్యస్వరూపము చేతనాచేతనవిలక్షణము.నిత్యవిభూతి,లీలావిభూతి ఈరెండును ఆయనకే చెందినవి.జగత్తుకు పరమాత్మకు శరీర శరీరి సంబంధమునుబట్టి ఐక్యము చెప్పబడుచున్నది.దీనిని ప్రతిపాదించి ఆళ్వారులు కుదృష్టుల అభేద వాదమును,బౌద్ధుల శూన్యవాదమును నిరసించినారు.ఇంతేకాక ఈదశకమునందు శ్రియఃపతియే పరతత్త్వమని నిష్కర్షించి చెప్పినారు.

## మొదటి పత్తు రెండవ తిరువాయ్ మొళి" వీడుమిన్" సారాంశము.

16.సంసారిణోప్యనుజిఘృక్షురసౌ దయాళు
రల్పాస్థిరేతరపుమర్థరుచిం నిరస్యన్
తత్త్యాగపూర్వహరిభక్తి సుధాంబుధానా
ముద్దీపినీముపదిదేశ మునిర్ద్వితీయే॥

తా॥నమ్మాళ్వారులు మనపైన అపారమైన దయకలిగిన మహానుభావులు.సంసారులకు అల్పములు,అస్థిరములైన సంసారభోగములయందు అమితమైన రుచి.ఆళ్వారులు సంసారిచేతనులకుండెడి సంసారభోగములయందలి రుచిని పోగొట్టతలచి జ్ఞానమును కలిగించు ఇతరపురుషార్థ త్యాగరూర్వకమగు హరిభక్తియనెడు అమృతమును రెండవ తిరువాయ్ మొళియందు ఉపదేశించినారు.

శ్రీకృష్ణపరమాత్మ సర్వధర్మపరిత్యాగపూర్వకముగా తనను మాత్రమే శరణాగతిచేసినచో

సమస్తపాపములనుండి విడుదలకావించి మోక్షపురసార్థము ఇచ్చెదనని చరమోపదేశము కావించెను.

## మొదటి పత్తు మూడవ తిరువాయ్ మొళి "పత్తుడై"   సారాంశము

17.దూరస్థ మప్యథ మునిః కమలాసహాయ
మైచ్ఛె స్సముద్భవశతై స్సులభీభవంతం
ఆఖ్యాయ భక్తి మపి తత్ర విధాయ తస్య
సేవాం చకాంక్ష కరణ త్రయత స్త్వతీయే॥

తా॥సర్వేశ్వరుడు శ్రియఃపతి కంటికి కనిపించక ఎక్కడో దూరముగా ఉన్నాడు.కాని మనము సంకల్పించినచో అనేకవిధములైన అవతారములచే ఆ స్వామి మనకు పరమసులభుడగుచున్నాడు.అట్టి సౌలభ్య సౌశీల్యాదిగణపరిపూర్ణుడైన స్వామిని గూర్చి నమ్మాళ్వారులు తెలిపినారు.ఆ సర్వేశ్వరునియందు నిరంతర భక్తిని చేసి ఆళ్వారులు త్రికరణములచేత స్వామి యొక్క కైంకర్యమును పొందవలెనని ఈ తిరువాయ్ మొళిలో ఆశించిరి.

## మొదటి పత్తు నాలుగవ తిరువాయ్ మొళి "అఞ్జిరై"   సారాంశము.

18.తత్కాంక్షితానధిగమేన ముని ర్విషణ్ణః
ప్రాప్తో దశాంచ హరిభుక్త విముక్తనార్యా
సర్వాపరాధసహతా మవబోధ్య దూతై
శ్శౌరే స్స్వదోషపరతామలునా చ్ఛతుర్థే॥

తా॥ఆళ్వారులు తాము అభిలషించిన విధముగా బాహ్యసంశ్లేషము పొందనందున అత్యంత దుఃఖమును పొందిరి.అట్లు దుఃఖపడుచు భగవంతునిచే అనుభవింపబడి విడువబడినవారగుటచే విరహవ్యథను అనుభవించుచున్న నాయికావస్థను పొందిరి.భగవంతుడు భక్తుల సమస్తదోషములను భోగ్యములుగా గ్రహించుటను దూతలద్వారా తెలియచేసెను.ఈదశకమున భగవంతుడు తమ దోషములందు చిత్తమునుంచుటను ఆళ్వార్ నాయకి పోగొట్టిరి.

## మొదటి పత్తు ఐదవ తిరువాయ్ మొళి “వళవేజు”

19.స్వాలింగనాది చపలే పురుషోత్తమేపి

స్వాయోగ్యతా మభిదధద్విముఖశ్శఠారిః

త్రైవిక్రమాదిచరితం ప్రతిభోద్యతేన

నీత స్స్వశీలవశతా మథపంచమేభూత్॥

తా॥విరహవ్యధను అనుభవించుచున్న ఆళ్వారు నాయకి అవస్థను చూచి సర్వేశ్వరుడు ఆమెను ఆలింగనము చేసుకొనవలెనని సంకల్పించెను.ఆళ్వార్ నాయకి తన అయోగ్యతను తలచుకొని విముఖురాలాయెను.అప్పుడు భగవంతుడు అద్భుతమైన త్రివిక్రమాది అవతార లీలలను తెలియచేసి తనను స్వాధీనము చేసుకొనెనని ఆళ్వారులు ఈతిరువాయ్ మొళిలో తెలిపి

న్నారు.

## మొదటి పత్తు ఆరవ తిరువాయ్ మొళి “పరివదిలీశనై” సారాంశము.

20.దాస్యేషు దేశసమయాంగ కలాప కర్తృద్రవ్యాదినా

న నియమః పురుషోత్తమస్య

భక్తిః పరం బహుమతా తత ఏవ సోయం

స్వారాధ ఇత్యుపదిదేశ మునిస్తు షష్ఠే॥

తా॥పరమపురుషుడు సర్వేశ్వరుడగు శ్రియఃపతి కైంకర్యమునందు దేశము,కాలము,పరికరాదులు,అధికారి,ద్రవ్యము మొదలగు నియమములు లేవు.గాఢమైన భక్తియొక్కటియే ఇచ్చట ప్రధానమైనది.భక్తిచేతమాత్రమే భగవంతుని సుకరముగా ఆరాధించవచ్చునని భక్తికి మారుపేరైన ఆళ్వారులు ఈ ఆరవ తిరువాయ్ మొళియందు తెలియచేసినారు.

## మొదటి పత్తు ఏడవ తిరువాయ్ మొళి సారాంశము (పిరవిత్తుయఱర)

21.పుంస శ్రియః ప్రణయినః పురుషార్థసీమ్నో
నిందన్ ఫలాంతరపరా న్నిరవద్యగంధాత్
తద్రస్యతార్జ్వ గుణజాత సమర్థనేన
తత్సేవనం సరస మాహ స సంతమేవ॥

తా॥పరమపురుషుడుపురుషోత్తముడు శ్రియఃపతి చతుర్విధఫలపురుషార్థముల కంటె ప్రధానమైనవాడు.ఆయనతో మనకున్న సహజసంబంధము అతిప్రధానమైనది.అట్టి నిర్దుష్ట సంబంధము వలన నమ్మాళ్వారులు ఇతరఫలములన్నింటిని నిందించినారు.సర్వేశ్వరుని మధురాతిమధురమైన గుణగణములను కీర్తించి ఆళ్వారులు మహదానందప్రదమైన భగవంతుని కైంకర్యమును ఏడవ తిరువాయ్ మొళిలో కోరినారు.

## మొదటి పత్తు ఎనిమిదవ తిరువాయ్ మొళి “ఓడుమ్పుళ్” సారాంశము.

22.కౌటిల్య వత్సు కరణత్రితయేపి జంతు
ష్వాత్మీయ మేవ కరణ త్రితయైక రూప్యమ్
సందర్శ్య తా నపి హరి స్స్వవశీకరోతి
త్యాచష్ట సాంద్రకరుణో ముని రష్టమేన॥

తా॥ప్రాణులకు త్రికరణశుద్ధి ఉండదు.ఇంకను వారిలో కౌటిల్యము మెండుగా ఉండును.అట్టి ప్రాణులయందును సర్వేశ్వరుడు శ్రియఃపతి తన త్రికరణములచే ఆర్జవమును చూపి స్వాధీనముచేసుకొనునని ఆళ్వారులు ఈ తిరువాయ్ మొళిలో అనుగ్రహించినారు.

## మొదటి పత్తు తొమ్మిదవ తిరువాయ్ మొళి" ఇవైయుం" సారాంశము.

23.ఆత్మార్జవానుభవకౌతికినోస్య శౌరి

రాత్మోపభోగరుచి మభ్యధికాన్దదాసః

దేవ్యాదివ ద్రసయితా క్రమతోఖిలాంగా

న్యాశ్రిశ్రయ త్తదవద న్నవమే శఠారిః॥

తా॥శ్రియఃపతి యొక్క ఆర్జవమనెడి దివ్యగుణమునకు ఆళ్వారులు మిక్కిలి సంతోషించిరి.శ్రీకృష్ణభగవానుడు భగవదనుభవమునందు అత్యంత ప్రీతిని ఆళ్వారులకు ప్రసాదించెను.అట్లే శ్రీభూనీళా దేవేరులకు ఆనందమును కలుగచేయుచున్న శ్రీకృష్ణుడు తన సమస్తావయవములను క్రమముగా ఆక్రమించినాడని నమ్మాళ్వారులు ఈ తొమ్మిదవ తిరువాయ్ మొళిలో తెలియచేసినారు.

## మొదటి పత్తు పదవ తిరువాయ్ మొళి" పొరుమానీళ్ పడై" సారాంశము.

24.ఇత్థం శ్రియఃపతి కృత స్వసమస్త దేహ

సంశ్లేష లక్షణ ఫలస్య సుదుర్లభస్య

భక్త్యాది వత్స్వగణనేపి చ తత్ప్రసాదా

న్నిర్హేతుకత్వమవదద్దశమే శఠారిః॥

తా॥భగవంతుని పొందుట అంతసులువైన పనికాదు.అట్టి భగవంతుడే తన సమస్తావయవములతో సంశ్లేషమును భక్త్యాది సాధనములను తనకొసంగినాడని ఆళ్వారులు తెలియచేసినారు.భగవంతుని నిర్హేతుకకృప వలన తనకు భక్తి ఏర్పడినదని ఆళ్వారులు ఈదశకమున అనుగ్రహించినారు.

## రెండవ పత్తు మొదటి తిరువాయ్ మొళి “వాయుమ్ తిరై” సారాంశము

25.పూర్వానుభూత మురవైరి గుణాభివృద్ధ

తద్బాహ్యసంగమ రుచి స్తదలాభఖిన్నః

సర్వానపి స్వసమదుఃఖిన ఏవ భావా

నాహ ద్వితీయశతకస్య శఠారి రాద్యేః॥

తా॥నమ్మాళ్వారులు అంతకుముందే శ్రీకృష్ణగుణానుభవమును పొందినారు.దానిచే శ్రీకృష్ణుని బాహ్యసంశ్లేషమునందు అత్యంతప్రీతి కలిగినవారైరి.అది లభించకపోవుటచే దుఃఖించుచు సకలపదార్థములు కూడ తమతో సమానమైన దుఃఖమును అనుభవించుచున్నవని ఈ దశకములో ఆళ్వారులుచెప్పుచున్నారు.

## రెండవ పత్తు రెండవ తిరువాయ్ మొళి” తిణ్ణన్ వీడు” సారాంశము.

26.సంశ్లిష్య దుఃఖశమనా న్ముదితః ప్రసంగా

త్తన్మూల మబ్జనయనస్య మహేశ్వరత్వమ్

ఆహా న్వయాదితరతోపి మనుష్యభావే

పౌరాణికోక్తనయత శ్శఠజిద్ద్వితీయే॥

తా॥నమ్మాళ్వారులు భగవత్సంశ్లేషసౌఖ్యమును పొందినవారైరి.ఆసంశ్లేషమునకు కారణము భగవంతునియొక్క మనుష్యావతారమందలి పరత్వమే.దానిని అన్వయ వ్యతిరేక పద్ధతిలో ఆళ్వారులు పురాణోక్తిననుసరించి ఈదశకమున వివరించిరి.

రెండవ పత్తు మూడవ తిరువాయ్ మొళి" ఊనిల్ వాజ్"
సారాంశము.

27.అంతస్స్థ సర్వరస మంబుజలోచనస్య
సంయోగరూప మవగాహ్య సుఖామృతాబ్ధిమ్
తద్దేశిక ప్రథమసూరిగణైః కదాస్యా
త్సంగో మమే త్యకథయత్సముని స్తృతీయే ॥

తా॥నమ్మాళ్వారులు సమస్తరసములతో నిండిన భగవత్సంశ్లేష సుఖసాగరమున నిమగ్నమైయుండిరి.ఆ దివ్యానుభవమును పొందిన నిత్యసూరిగణముతో తనకు సహవాసము ఎప్పుడు కలుగునోయని ఆళ్వారులు మూడవ దశకమున ఆశించిరి.

రెండవపత్తు నాల్గవ తిరువాయ్ మొళి" ఆడియాడి" సారాంశము.

28.తత్రప్రర్థితా నధిగమేన సముత్థితార్తి
రగ్రే హరేః పరముఖేన యథావిధేయమ్
ఆర్తే ర్ని వేదన మపాకరణార్థనంచ
మూర్ఛాన్తథా మునిరగా న్మహతీంచతుర్థే ॥

తా॥తాము అభిలషించిన విధముగా నిత్యసూరిబృందముతో కూడిన భగవదనుభవము ఆళ్వారులు పొందలేదు.కావున ఆళ్వారుల ఆర్తి మిక్కుటమయ్యెను.వారు తమ ఆర్తిని భగవంతుని ముందుఇతరుల వాక్యము ద్వారా విన్నవించుటయు దానిని పోగొట్టుమని కోరుటయు చేయునట్లుగ మూర్ఛను పొందిరని ఈ దశకములో తెలిపినారు.

## రెండవ పత్తు ఐదవ తిరువాయ్ మొళి "అన్దామత్తన్బు" సారాంశము.

29.ఆగమ్య సూరి సహిత స్సమపాకృతార్తి

రత్యుజ్జ్వల న్మరకతాచల సన్నిభాంగః

ఈశః ప్రఫుల్ల కమలాక్షి కరాంఘ్రిరాసీ

త్తత్వంచమే స కథయ న్ముని రానసంద॥

తా॥శ్రియఃపతి శ్రీమన్నారాయణుడు నిత్యసూరిబృందముతోసహా విచ్చేసి నమ్మాళ్వారుల దుఃఖమును పోగొట్టెను.అప్పుడు సర్వేశ్వరుడు అద్భుతముగా ప్రకాశించుచున్న ఇంద్రనీలమణి పర్వతము వంటి తిరుమేను కలవాడయ్యెను.ఇంకను స్వామి వికసిత పద్మ నేత్ర కరచరణములు కలవాడయ్యెనని స్వామి నమ్మాళ్వారులు ఈదశకమున వివవరించినారు.

## రెండవ పత్తు ఆరవ తిరువాయ్ మొళి" వైకుందా" సారాంశము.

30.నీచంచమా మధిగతోయమితిధి స్వసూక్త్యా

జాతాం హరే స్స్వవిరహాగమనేతిశంకాం

షష్ఠే నిరస్య దృఢసంగగిరా శఠారి

రాత్మాన్వయి ష్వపి తదాదరతోభ్యవందత్॥

తా॥శ్రియఃపతి నీచుడనైన తనను పొందెనని ఆళ్వారుల శ్రీసూక్తి.దానిచే భగవంతునకు ఆళ్వారుల విశ్లేషభయము కలిగెను.ఆ భయమును నమ్మాళ్వారులు ఆరవ దశకమున స్థిర సంశ్లేష వార్తచే పోగొట్టి ,తమ సంబంధ సంబంధుల యందు కూడ భగవంతుడికి కలిగిన సంప్రీతిని చూచి సంతోషించిరి.

రెండవ పత్తు ఏడవ తిరువాయ్ మొళి" కేశవన్ తమర్"
సారాంశము.

31.తే కేశవాభిమతతా మభజంత హంత!
యే మామకా ఇతి వద స్నధి సప్తమం సః
తస్య స్వరూప గుణచేష్టిత వాచినామ-
భూత ద్విషట్కముఖరో ముముదే మునీంద్రః॥

తా॥ నా సంబంధ సంబంధ సంబంధ సంబంధులందరును శ్రియఃపతికి ప్రీతిపాత్రులైనారని ఆళ్వారులు ఆశ్చర్యమును ప్రకటించినారు.శ్రియఃపతియొక్క స్వరూప రూప గుణవిభవాదులకు,దివ్యచేష్టితములకు వాచకములగు కేశవాది ద్వాదశ తిరునామములను అనుగ్రహించిన శఠకోపమునీంద్రులు ఏడవ దశకమున సంతోషించిరి.

రెండవ పత్తు ఎనిమిదవ తిరువాయ్ మొళి" అణైవదు"
సారాంశము.

32.ఆత్మాన్వయిష్వసి హరేః ప్రియతా మవేక్ష్య
సర్వాత్మన స్స్వజనయ న్మని రష్టమేన।
మోక్షప్రదత్వ ముపదిశ్య తదాభిముఖ్యా
లాభత స్స్వలాభ మధికం బహుమన్యతేస్మ॥

తా॥ నమ్మాళ్వారులు తమ సంబంధులందరు సర్వేశ్వరునకు అత్యంత ప్రీతిపాత్రులగుటను చూచి చేతనులందరిని తమ బంధువులుగా చేయుటకు తలచిరి.వారందరికి భగవంతుడు మోక్షమును ప్రసాదించునని ఉపదేశించిరి.కాని వారెవ్వరు ఆళ్వారుల సదుపదేశమునకు కనీసము ఆభిముఖులు కాలేదు.అప్పుడు ఆళ్వారులు వారివలెకాక తమకుకలిగిన భగవదాభిముఖ్యమును ఎనిమిదవ దశకమున ప్రస్తుతించిరి.

## రెండవ పత్తు తొమ్మిదవ తిరువాయ్ మొళి" ఎమ్మావీడు" సారాంశము.

33.మోక్షాదరం స్ఫుట మవేక్ష్య మునే ర్ముకుందే
మోక్షం ప్రదాతు మసదృక్షఫలం ప్రవృత్తే
ఆత్మేష్ట మస్య పదకింకరతైకరూపం
మోక్షాఖ్యవస్తు నవమే నిరణాయ తేన॥

తా॥నమ్మాళ్వారులకు కలిగిన మోక్షమును పొందవలెననెడు తీవ్రమైన అభిలాషను సర్వేశ్వరుడు శ్రియఃపతి గ్రహించి దానిని వారు అభిలషించిన విధముగా ప్రసాదించుటకు సిద్ధపడెను. ఆళ్వారులు సర్వదేశ సర్వకాల సర్వావస్థలయందు శ్రియఃపతి శ్రీమన్నారాయణుని దివ్యశ్రీచరణారవిందదాస్యమును కలిగియుండటమే మోక్షమని తమ అభీష్టమును ఈతొమ్మిదవ దశకమున నిర్ణయించిరి.

## రెండవ పత్తు పదవ తిరువాయ్ మొళి" కిళరొళి" సారాంశము.

34.ఏత న్నిజార్థితమిహైవ హరిః ప్రదాతు
మానేదివాన్ వనమహీధర మిత్యవేక్ష్య
ప్రాప్యం తమేవ చ తదన్వయినంచ సర్వం
ప్రాచీక శ త్స దశమే దశకే మునీంద్రః॥

తా॥ఆళ్వారులు పరమాత్మ నిత్యకైంకర్యమునే మోక్షమని అదే పరమప్రాప్యమని భావించిరి.అట్టి దానిని ఈభూమియందే ప్రసాదించు

టకు తిరుమాలిరుంశోలై దివ్యదేశమున స్వామి వేంచేసెనని నమ్మాళ్వారులు తిరుమాలిరుంశోలై కొండను,దానితో సంబంధించిన అన్ని వస్తువులను పొంకలిగినవని పదవ దశకమున తెలియచేసినారు.

మూడవ పత్తు మొదటి తిరువాయ్ మొళి" ముడిచ్చోది" సారాంశము..

35.ఆద్యే తృతీయశతకస్య వనాద్రిభర్తు

రాపాద మౌళ్యవయవా భరణాభి రూప్యమ్

బ్రహ్మాదివాగవిషయంచ మహాప్రభావం

సౌందర్యమగ్నహృదయ శ్శఠజి చ్చశంస॥

తా॥తిరుమాలిరుంశోలై దివ్యక్షేత్రమునకు అధిపతియైన శ్రియఃపతి శ్రీమన్నారాయణుని యొక్క ఆపాదమస్తకము వరకు కల దివ్యావయవముల యొక్క దివ్యాభరణముల యొక్క సౌందర్యమును బ్రహ్మాదిదేవతలు వర్ణింప శక్యము కాని ప్రభావాతిశయమును, సుందరబాహుస్వామి సౌందర్యమునందు మునిగిన శ్రీశఠకోపమునీంద్రులు మూడవపది మొదటి తిరువాయ్ మొళియందు అద్భుతముగా వర్ణించిరి.

మూడవ పత్తు రెండవ తిరువాయ్ మొళి" మున్నీర్ ఞాలమ్" సారాంశము.

36.సంకుచితస్వకరణ స్సహరిం యథేష్టం

భుంజే న చాహ మితి భిన్నమతి శ్శఠారిః

ఆశ్వాసిత శ్చ హరిణా స్వమహత్త్వయైవ

భోగే ష్వశక్తి రితి తత్కధితం ద్వితీయే॥

తా॥నేనుకూడ సంకుచిత కరణములు కలవాడినై శ్రియఃపతిని యథేష్టముగా అనుభవించలేకపోతినే అని ఆళ్వారులు మధనపడిరి.మారిన బుద్ధికలిగిన ఆళ్వారులు భగవంతుని చేతన మహత్త్వముచేతనే అకరణముల యొక్క అసమర్థత ఏర్పడినదని సమాధానపడిరి.ఈఅర్థవిశేషమును రెండవ తిరువాయ్ మొళిలో తెలిపిరి.

## మూడవ పత్తు నాలుగవ తిరువాయ్ మొళి"  పుకజు నల్" సారాంశము.

38.సర్వం జగ త్సమవలోక్య విభో శ్శరీరం
తద్వాచిన శ్చ సకలానపి శబ్దరాశీన్
తా న్భూత భౌతిక ముఖాన్కథయన్ పదార్థాన్
దాస్యం చకార వచసైవ ముని శ్చతుర్థే॥

తా॥సమస్త ప్రపంచమును,తద్వాచకములైన  సమస్త శబ్దరాశిని శ్రియఃపతియొక్క దివ్య తిరుమేనిగా దర్శించిన ఆళ్వారులు ,పంచభూతములను వాని కార్యములగు పదార్థములనన్నింటిని చెప్పుచు నాలుగవ దశకమున వాగ్రూపకైంకర్యమును

చేసిరి.

## మూడవ పత్తు ఐదవ తిరువాయ్ మొళి"  మొయ్ మ్మామ్" సారాంశము.

39.పూర్వేణ దాస్యవిధినా పురుషార్థసీమ్నా
హర్షప్రకర్ష వివశః ఖలు పంచమే సః
ఆనందనై రవికృతా న్వినినింద మూర్ఖాన్
శౌరే ర్గుణైస్తు వికృతా న్ప్రశశంస భూయః॥

తా॥పురుషార్థములకు అన్నింటికి ప్రధానమైన కైంకర్యములను చేయుటచే  నాలుగవ దశకముచే ఆళ్వారులు ఆనందాతిశయమునకు  పరవశులైనారు.ఆనందప్రదములగు భగవంతుని కళ్యాణగుణములచే వికారమును పొందని మూర్ఖశిఖామణులను ఆళ్వారులు ఐదవ దశకమున నిందించిరి.వికారము చెందినవారిని తిరిగి ప్రశంసించిరి.

## 3వ పత్తు 6వ తిరువాయ్ మొళి" శెయ్యతామరై" సారాంశము.

40.తాన్నిందితా నపి విహాతుమసావశక్త
శ్శౌరేర్దురాసదతయావిముఖాన్విచార్య
అర్చావతార సులభత్వ మువాచతేషా
మేవంచతేషు విముఖేషు శుశోచషష్ఠే॥

తా॥ఆళ్వారులు తమచే నిందింపబడినవారినైనను వారిని పొందుటకు శక్యము కానందున వారిని భగవద్విముఖులుగా తలంచిరి. కాని వారిని వదలిపెట్టక అర్చావతారసౌలభ్యమును వారికి ఉపదేశించిరి.ఇట్లు ఉపదేశించినను వారు భగవద్విముఖులుగానే ఉండుటచే ఆరవ దశకమున వారిని గూర్చి ఆళ్వారులు దుఃఖించిరి.

## 3వ పత్తు 7వ తిరువాయ్ మొళి" పయిలుమ్ శుడరొళి" సారాంశము.

41.తచ్ఛోకశాంతివిధయే హరిణా ప్రసాదా
దావిష్కృతాన్ స్వగుణచేష్టిత భోగశీలాన్
ఆలోక్య వైష్ణవజనా న్మని రాత్మనాథా
నాఖ్యాయతా నతిజహర్ష చ సప్తమే సః॥

తా॥ ఆళ్వారులు తమ ఉపదేశమువలన ప్రయోజనము కనపడని కారణము వలన దుఃఖించిరి.వారికి కలిగిన దుఃఖమును ఉపశమింపచేయుటకై సర్వేశ్వరుడు ప్రయత్నించగా ఆళ్వారులు ప్రకాశించెను.భగవంతుని దివ్యగుణచేష్టితములను అనుభవించి పరవశించు స్వభావముకల శ్రీవైష్ణవులను చూచి ఆళ్వారులు వారిని తమకు నాథులని ప్రశంసించి ఏడవ దశకమున మిక్కిలి సంతోషమును ప్రకటించిరి.

## 3వ పత్తు 8వ తిరువాయ్ మొళి" ముడియానే" సారాంశము.

42.షష్ఠే బహి ర్న యవతో హరి మాప్తు మాశా
దాతా మునే రథ తదీయజనావలోకాత్
ఉత్తంభితా స్వకరణై రపి కామయంతీ
శోకాతిరేక జననీ పునరష్టమేభూత్॥

తా॥నమ్మాళ్వారులకు బాహ్యనేత్రములచే భగవంతుని దివ్యమంగళవిగ్రహమును దర్శించి అనుభవించవలెనని తీవ్రమైన కోరిక ఆరవ దశకములో కలిగినది.ఏడవ దశకములో భాగవతోత్తములను సేవించుట వలన వారి సంశ్లేష కారణమున వారి కోరిక వృద్ధిపొందెను.ఎనిమిదవ దశకమున ఆళ్వారుల స్వకరణములచేతను కోరికలు కలుగచేయబడినవగుచు తీవ్రమైన శోకమును పుట్టించెను.

ఆళ్వారుల కోరిక మిక్కుటముకాగా వారి సమస్త కరణములు కరణాంతరవ్యాపారము నాశించినవి.అట్టి సమస్త కరణముల వ్యాపారమును ఆళ్వారులు తామాశించి ఎంతో దుఃఖించిరి.

## 3వ పత్తు 9వ తిరువాయ్ మొళి" శొన్నాల్ విరోదమ్" సారాంశము.

43.అన్యస్తవేన విషయా నధిగంతు మిచ్ఛూ
నాలోకన విస్మృతనిజవ్యసనో దయాళుః
తస్మా న్నివార్య మనుజా న్వఫల స్స శౌరే
రన్యేష్వనర్హ కరణం నవమే స్వమాఖ్యపిత్॥

తా॥ఇతరులను స్తుతించుటకై శబ్దాదులను అన్వేషించుచున్న నీచమానవులను చూచి విచారించి దయార్ద్రహృదయము కలిగిన నమ్మాళ్వారులు తమ దుఃఖమును మరచి ఇతరులను స్తుతించు ఆకవుల దృష్టిని మరల్చుటకు ప్రయత్నించి విఫలులైరి.ఇక ఆళ్వారులు తమ వాగాదీంద్రియములు సర్వేశ్వరుడగు శ్రియఃపతి కంటె ఇతర విషయములను స్తుతించుటకు అనర్హమగుటకు సంతోషము కలుగుచున్నదని ఈ తొమ్మిదవ దశకమున అనుగ్రహించినారు.

## 3వ పత్తు 10వ తిరువాయ్ మొళి" శన్మమ్ పలపల" సారాంశము.

44.భూయోవతీర్య భువి దివ్యవపు స్స్వకీయం
ప్రత్యక్షయంత మఖిలాం శ్చగుణా ననంతం
స్తుత్వా ముని స్స్వచరితార్థతయా న కించి
దుఃఖ మ్మమే త్యతితరాం దశమే తుతోష॥

తా॥మరల మరల భూమియందవతరించి తన దివ్యమంగళవిగ్రహమును,కళ్యాణగుణగణములను అనుభవించునట్లు చేయుచున్న శాశ్వతుడైన శ్రియఃపతిని తమచే అనుభవించబడినవే యగు అర్థవిశేషములగుటచే స్తుతించి తనకు దుఃఖము ఎంతమాత్రము లేదని ఆళ్వారులు ఈ పదవ దశకమున అనుగ్రహించినారు.

## 4వ పత్తు 1వ తిరువాయ్ మొళి" ఒరునాయకమ్" సారాంశము.

45.ఆద్యే చతుర్థ శతకే దశకే శఠారి
స్తుష్ట స్తథా పరహితం దయయా వివృణ్వన్
రాజ్యస్వరాత్మ పరిభోగ చలాల్పభావౌ
సమ్యక్ప్రసాద్య హరి మేవ పుమర్థ మాహ॥

తా॥నాలుగవ శతకమునందలి మొదటి దశకమున నమ్మాళ్వారులు పరమ దయతో ఇతరులకు ఉపదేశము చేయుచు రాజ్యము యొక్క కైవల్యము యొక్క అల్పత్వ అస్థిరత్వములను చెప్పి శ్రియఃపతియే పరమ పురుషార్థమని నిర్ణయించినారు.

## 4వ పత్తు 2వ తిరువాయ్ మొళి" పాలనాయ్" సారాంశము.

46.తం పూరుషార్థ మితరార్థ రుచే ర్నివృత్యా
సాంద్రస్ప్రహా సమయదేశ విదూరగంచ
ఈప్సు శ్శుచా తదనవాప్తిభువా ద్వితీయే
స్త్రీభావనాం సమధిగమ్య ముని ర్ముమోహ॥

తా॥నమ్మాళ్వారులకు భగవంతునికంటె వేరైన పురుషార్థములందు ఎంతమాత్రము కోరిక లేదు.తాము అభిలషించు భగవంతుడనెడు పరమ పురుషార్థమును ఎప్పుడో జరిగిన సర్వేశ్వరుని అతిమానుషచేష్టితములను ఇప్పుడే పొందకోరినారు.కాని దేశ కాలాదులచే అవి దూరమైనవి అగుటచే కలిగిన దుఃఖముతో నమ్మాళ్వారులు స్త్రీత్వభావమును పొంది ఈరెండవ దశకమున మూర్ఛిల్లిరి.

## 4వ పత్తు 3వ తిరువాయ్ మొళి" కోవైవాయాళ్" సారాంశము.

47.ప్రీతః పరం హరి రముష్య తథా స్వభావా
దేతన్మనో నచనదేహకృత క్రియాభిః
స్రక్చందనప్రముఖ సర్వవిధస్వభోగ్య
స్సంశ్లిష్టవానిద మువాచ ముని స్తుతీయే॥

తా॥ఆళ్వారులు సర్వదేశ సర్వకాల సర్వావస్థలయందును భగవంతుడు ఇంతకుముందు ఎపుడో చేసిన దివ్యచేష్టితముల నన్నిటిని ఇప్పుడే అనుభవించవలెనని తలచిరి.భగవంతుడు ఆళ్వారుల స్వభావమును చూచి మిక్కిలి సంతోషించెను.ఆళ్వారులు తమ త్రికరణములచే చేయు కైంకర్యములను దివ్యమాలలుగాను దివ్యశ్రీచందనము మొదలగు సమస్తభోగ్యపదార్థములుగాకలవాడై వారితో సంశ్లేషించినారని నమ్మాళ్వారులు ఈ 3వ దశకమున అనుగ్రహించినారు.

4వ పత్తు 4వ తిరువాయ్ మొళి “మణ్ణై యిరున్దు” సారాంశము.

48.తేన ప్రహర్ష మతిమాత్రభవం స్వకీయం
సాత్మ్యం విధాతు మథ దూరగతే ముకుందే
సంబంధిన శ్చ సదృశాంశ్చ విలోక్య శౌరే
ర్భ్రామ్యం స్తమేవ ముని రార్తి మగా చ్చతుర్థే॥

తా॥భగవంతుని ప్రణయిత్వానుభవముచే ఆళ్వారుల ఆనందము అధికమైనది.దానిని అణచివేయుటకై ఇహ పర భోగములను ప్రసాదించు భగవంతుడు తనకు దూరము కాగా శ్రీకృష్ణభగవానునితో సంబంధము కల గోవులు తినగా మిగిలిన వెన్న మొదలగు పదార్థములను చూచి భ్రమించినవారై శఠకోపమునీంద్రులు ఆ బాధను నాలుగవ దశకమున వ్యక్తము చేసిరి.

4వ పత్తు 5వ తిరువాయ్ మొళి” వీత్తిరున్దు” సారాంశము.

49.ఆనందనిర్భర మధీన విభూతియుక్తం
వైకుంఠనాథ మథ వీక్ష్య మునిస్తువన్ సః
నాన్య స్సమోస్తి మమ నాప్యనవాప్యమద్యే
త్యానందపూర మధిపంచమ మాససాద॥

తా॥ఆనంద పరిపూర్ణుడు,సమస్త విభూతులతో కూడినవాడు అయిన శ్రీవైకుంఠనాథుడగు శ్రియఃపతిని నమ్మాళ్వారులు సాక్షాత్కరింపచేసుకొని స్తోత్రము చేయుచున్నవారై ఇపుడు నాతో సమానుడు ఎవడును లేడు. నాకు పొందుటకు అశక్యమైనదేదియు లేదని ఆళ్వారులు వారికి కలిగిన బ్రహ్మానంద వైభవమును ఈ అయిదవ దశకమున అనుగ్రహించినారు.

## 4వ పత్తు 6వ తిరువాయ్ మొళి" తీర్పారై" సారాంశము.

50.స్వప్నోపమా దనుభవా దముతోప్యలబ్ద

స్వాపేక్షితే శఠజితి వ్యసనా ద్వసంజ్ఞే

యే క్షుద్రదేవముఖతః పరిహర్తుకామా

స్తే వారితా స్తదుచితజ్ఞ గిరైవ షష్ఠే॥

తా॥ కల వంటిదైన భగవదనుభవమువలసను తన కోరిక నెరవేరకపోవుటచేత నమ్మాళ్వారులు దుఃఖముచే మూర్ఛను పొందిరి.అపుడు కొందరు క్షుద్రదేవతలను ఆశ్రయించి ఆళ్వారుల మూర్ఛను తొలగించుటకు ప్రయత్నించగా ఆళ్వారుల స్వభావము తెలిసిన చెలికత్తె వారిని అడ్డగించి భగవత్సంబంధ పదార్థముతో ఆళ్వారుల మోహమును తొలగించెనని ఈ ఆరవ దశకమున వివరించిరి.

## 4వ పత్తు 7వ తిరువాయ్ మొళి" శీలమిల్లా" సారాంశము.

51.తద్భేషజా త్స హరినామ కథాప్రసంగా

త్సంజ్ఞా ముపేత్య ముని రుద్భటదుఃఖబోధః

ఆపత్సఖత్వ ముఖవాచకత స్తముచ్చై

రాక్రుశ్య వాంఛిత మయాచత సప్తమేన॥

తా॥ఆళ్వారులు భగవద్విశ్లేషదుఃఖమును అనుభవించుచుండగా చికిత్సకుడు భగవన్నామానుసంధానము చేయగా  వారు తెలివిని పొందినవారైరి.అతిశయించిన దుఃఖముతో భగవంతునియొక్క రక్షణవ్యాపారాది గుణములను వాచకములగు మాటలతో గట్టిగను అతిదీనముగను పలికి ఆ భగవంతుని తన ప్రార్థనను నెరవేర్చుమని కోరెను.

## 4వ పత్తు 8వ తిరువాయ్ మొళి" ఏఱాళుమ్" సారాంశము.

52.ఏవం రుదన్నపి శఠారి రలబ్ధ కామ
స్స్వోపేక్షణైక పరతా మవధార్య శౌరేః
తచ్చేషతాదిరహితే సకలే స్వకీయే
స్వస్మి న్నపి స్ఫురిత నిస్స్పృహతోష్టమేభూత్.

తా॥భగవంతుని కొరకై దుఃఖించుచున్న ఆళ్వారులు భగవంతుడు తనను రక్షించుటలో ఉపేక్షవహించెనని నిశ్చయించుకొని ఆయన కైంకర్యమునకు ఉపయోగపడని దేహాదులయందు,ఆత్మయందు విరక్తిచెందినవారై ఇవియన్నియు తనకు వ్యర్థమని ఈ ఎనిమిదవ దశకమున వివరించిరి.

## 4వ పత్తు 9వ తిరువాయ్ మొళి" నణ్ణాదార్" సారాంశము.

53.శోచన్మని స్స్వసదృశం చ సహాయ మిచ్ఛన్
లోకం విలోక్య విపరీతరుచిం విషణ్ణః
అత్రత్యవాస మసహన్ హరిణా స్వవాసం
వైకుంఠకం ప్రకటితం నవమే దదర్శ॥

తా॥దుఃఖములోనున్న ఆళ్వారులు తమకు సరియైన సహాయమును కోరుచున్నవారై లోకములోని జనులను విపరీత రుచి కలిగినవారిగా చూచి దుఃఖించి ఈ సంసారులతో సహవాసము దుస్సహమని శ్రియఃపతి శ్రీమన్నారాయణుడు తమకు వాసస్థానముగా చూపించిన శ్రీవైకుంఠ దివ్యనగరమును సాక్షాత్కరించుకొని ఈ 9వ దశకమున అనుగ్రహించినారు.

## 4వ పత్తు 10వ తిరువాయ్ మొళి" ఒన్ఱుమ్దేవుమ్" సారాంశము.

54.బంధే సమేపి హరిణా నిఖిలాత్మరాశేః
సంసారహేతు మితరత్ర పరత్త్వబోధమ్
వేదేతిహాసముఖతః పరిహృత్య శౌరేః
అర్చాతనో స్స దశమే వ్యవృణో త్పరత్వమ్ ॥

తా॥శ్రీమన్నారాయణునితో సకలాత్మలకు సంబంధము సమానమేయైనప్పటికిని సంసారమునకు కారణము వారికి ఇతర దేవతలయందున్న పరత్వబుద్ధి.సంసారులయొక్క ఇట్టి అజ్ఞానమును ఆళ్వారులు వేదములు ఇతిహాసములు మొదలైనవానిచే తొలగించి,అర్చామూర్తియైయున్న శ్రీమహావిష్ణువుయొక్క పరత్వమును ఈ దశకమున విస్తారముగా అనుగ్రహించినారు.

## 5పత్తు 1తిరువాయ్ మొళి "కైయార్" సారాంశము

55.ఆద్యే ముని స్స్వశతకస్య తు పంచమస్య
శ్రేయ స్స్వకీయహితబోధన మీక్షమాణః
ఏతద్విరోధిబహులస్య మమాత్ర హేతుః
శౌరేః కృపైవ మహతీతి శశంస భూయః ॥

తా॥నమ్మాళ్వారులు ఈ దశకమునందు శ్రేయోదాయకమైన తమయొక్క హితజ్ఞానమును చూచుచున్నవారై అపారమైన విరోధములుకల ఈ జ్ఞానమునకు కారణము శ్రీకృష్ణపరమాత్మయొక్క కృపయే కారణమని అనుగ్రహించినారు.

## 5వ పత్తు 2వ తిరువాయ్ మొళి “పొలిక పొలిక” సారాంశము.

56.ఆత్మోపదేశవిభవై శ్శమితాఘబృంద
మారబ్ధవైష్ణవ సమృద్ధి సమిద్ధ్య మానమ్
ఆలోకయన్ క్షితితలం కలినాప్యధృష్య
మాశా స్తమంగల మముష్య ముని ర్ద్వితీయే॥

తా॥నమ్మాళ్వారుల ఉపదేశ ప్రభావముచేత ఈ భూమండలము లోని పాపరాశి నశించెను.శ్రీవైష్ణవసమృద్ధితో నిండిపోయెను.ఆళ్వారులు అట్టి భూమండలమును చూచి ఆవైష్ణవసమృద్ధికి ఈదశకమున మంగళాశాసనము చేయుచున్నారు.

## 5పత్తు 3తిరువాయ్ మొళి” మాశరు శోది” సారాంశము.

57.పూర్వానుసంహిత మనోహరశౌరిమూర్తేః
సంశ్లేషలోలహృదయ స్తదలాభఖిన్నః
లాభే స్వయత్న మపి కర్తు మియేష దుఃఖాత్
భార్యాదశాం చ పరిగృహ్య ముని స్తృతీయే॥

తా॥పూర్వము శ్రీకృష్ణుని ఆలింగనము చేసుకొనవలెనని సంకల్పించి,అది లభించకపోవుటచే నమ్మాళ్వారులు దుఃఖించి నాయికావస్థను పరిగ్రహించి ఈదశకమున భగవత్సంశ్లేషము కొరకు సంకల్పించుకొనిరి.

5పత్తు 4తిరువాయ్ మొళి" ఊరెల్లామ్" సారాంశము.

58.తాం చ త్వరాం పిదధతీ సకలేంద్రియాణాం

ఆచ్ఛాదికా సవిధగాం శ్చ విసంజ్ఞ యన్తీ

వేలాతిగా విరహిణీత్వజుషో మునే స్తు

మోహాహ్వయా రజని రభ్యుదితా చతుర్థే॥

తా॥భగవద్విశ్లేషము అనుభవించుచున్న పిరాట్టి దశయందున్న నమ్మాళ్వారులకు ఒక రాత్రి కలిగినది.అది ఆళ్వారుల సమస్త ఇంద్రియముల యొక్క అపారమైన త్వరను మరపించునట్టిది.అది దగ్గరలోనున్న వస్తువులను కూడ కనిపించనీయడం లేదు.అది ఆళ్వారులకు మూర్ఛను కలిగించినది.అది అవధిలేనట్టి మోహమను పేరు కలిగిన రాత్రి.ఈవిషయమును నాల్గవ దశకమున ఆళ్వారులు వివరించినారు.

5పత్తు 5తిరువాయ్ మొళి" ఎంగనేయో" సారాంశము.

59.తాదృక్స్వమోహగలన సతి భావనాయా

భూమ్నా హరే రవయవాభరణాది దృష్ట్యా

ప్రత్యక్షత స్తదనుభూత్యనవాప్తితశ్చ

ప్రీత్యా శుచా ముని రయుజ్యత పంచమే సః॥

తా॥నమ్మాళ్వారులకు కలిగిన మోహము పోగా అనవరత భగదనువాతిశయముచే భగవంతుని యొక్కఅవయవాభరణాదుల సాక్షాత్కారము కలిగినది.కాని ప్రత్యక్షముగా భగవదనుభవము లభించలేదు.అప్పుడు సంభవించిన వెనుటి ప్రీతితోను,ఇప్పుడు ఏర్పడిన దుఃఖమును ఆళ్వారులు ఈదశకమున చెప్పుకొనిరి.

## 5పత్తు 6తిరువాయ్ మొళి” కడల్ జ్ఞానమ్” సారాంశము.

60.శోకం చ తం పరిజిహీర్షు రివాఖిలానాం
సర్గాదికర్తు రనుకారరసేన శౌరే
తస్య ప్రవృత్తి రఖిలా చరితామయేతి
తద్భావిత భావితమనాః ముని రాహ షష్ఠే ॥

తా॥నమ్మాళ్వారులు ఆరవ దశకమున తమకు కలిగిన దుఃఖమును పోగొట్టుకొనుటకై ప్రయత్నించిరి.సకల చేతనాచేతనముల సృష్ట్యాదివ్యాపారములను చేయుచున్న భగవంతుని అనుకరించి అమితమైన ఆనందమును పొందిరి.ఆనందతరంగితులైన ఆళ్వారులు భగవంతుని అద్భుతమైన దివ్యచేష్టితములను భావించి వాటిని తామే చేసితిమని చెప్పిరి.

## 5పత్తు 7తిరువాయ్ మొళి” నోత్తనోన్బిలేన్” సారాంశము.

61.ఏవం చ సోనధిగతాభిమత స్తదాప్తౌ
నారాయణా దితరసాధనశూన్యతాం స్వాం
తస్మై నివేద్య తదుపాయ ధియైవ కించి
దాశ్వస్తవా నథ మునిః కిల సంతమేన॥

తా॥ఈ దశకమున ఆళ్వారులు భగవంతుడు తనకు ఉపకరించినను అతడు వచ్చి సేవ అనుగ్రహించనందున అతనిని పొందుటలో అతనికంటె ఇతరసాధనములేవియు లేకుండుటను చెప్పి భగవంతుడే ఉపాయమని విశ్వసించిరి.

5పత్తు 8తిరువాయ్ మొళి" ఆరావముతే" సారాంశము.

62.ఆశ్వాసలబ్ధధృతినా మనసా సమేత్య
శ్రీకుంభకోణశయ మప్రతిమాభిరూప్యమ్
ఆలోక్య సాంత్వనవచః పరిరంభణాదీ
నప్రాప్తవా న్మని రఖిద్యత సోష్టమేన॥

తా॥నమ్మాళ్వారులు ఆశ్వాసము పొందిన ధైర్యము కలిగిన మనస్సుచేత కుంభకోణ దివ్యదేశమునందు శయనించియున్న అద్భుత నిరుపమాన సౌందర్యరాశియగు శ్రియఃపతిని సేవించి తాముకోరుకున్నవిధముగా భగవంతుని కుశలప్రశ్నకాని,ఆయన ఆలింగన భాగ్యముకాని లభించక ఈ దశకమున ఎంతో దుఃఖించిరి.

5పత్తు 9తిరువాయ్ మొళి" మానేయ్ నోక్కు" సారాంశము.

63.అన్యం మునిః ప్రతిహత స్తత ఏవఖేదా
ద్గన్తుం ప్రవృత్తమనసా పి తు దివ్యదేశం
తిద్భోగ్యతా మభిదధ త్తదధీశపాదౌ
యాయాం కదే త్యకథయ న్నవమే సదైన్యమ్॥

తా॥నమ్మాళ్వారుల కోరిక కుంభకోణ దివ్యదేశమున నెరవేరకపోవుటచే ఎంతో దుఃఖించిరి.ఎంతో బాధపడుచున్నవారై "తిరువళ్ళువాజ్" అను దివ్యదేశమునకు పోవుటకు నిశ్చయించుకొని ఆ క్షేత్రముయొక్క వైభవమును చెప్పి అక్కడ వేంచేసియున్న సర్వేశ్వరునియొక్క
తిరువడిత్తామరలను(చరణారవిందములను)ఎప్పుడు చేరుదునా అని తమ దైన్యమును ఈ దశకమున ప్రకటించిరి.

## 5పత్తు 10తిరువాయ్ మొళి" పిఱందవాఱుమ్" సారాంశము.

64.అర్చాం చ మౌననియతామపహాయ శౌరే

రాలాపయోగ్యవిభవే పున రాగతోసౌ

చిత్తస్య తద్గుణగణస్మరణే నిజస్వ

శైథిల్యవిఘ్నశమనం త మయాచతాంతే॥

తా॥అర్చామూర్తి మౌనము వీడి తనతో మాటలాడరని నమ్మాళ్వారులు వారిని విడచి తనతో మాటలాడుటకు తగిన విభవావతారమును ఆశ్రయించిరి.ఈ దశకమున ఆళ్వారులు తమ మనస్సు భగవంతుని కళ్యాణగుణగణములను స్మరించుటలో శైథిల్యమును పొందుటను పోగొట్టుమని భగవంతుని ప్రార్థించిరి.

## 6పత్తు 1తిరువాయ్ మొళి" వైకల్ పూంకజివాయ్" సారాంశము.

65శ్లో.ఆద్యే తు షష్ఠశతకస్య ముని స్తథార్తో

నారీ సమాధి మధిగమ్య నిజామవస్థామ్

అర్చాహరిం కమపి పక్షిభి రంతికస్థై

రాపన్నరక్షణసతీక్ష మబోధయ త్సః॥

తా॥ఈ దశకమునందు భగవద్వియోగ దుఃఖితులైన నమ్మాళ్వారులు తాయిమార్(తల్లి)దశను పొంది తమ స్థితిని తమదగ్గర తిరుగాడుచున్న పక్షుల చేత ఆర్తరక్షా దీక్షాపరాయణుడై అర్చాస్వరూపముతో తిరువణ్వండూర్ లో విరాజమానుడైయున్న శ్రియఃపతికి విన్నవించిరి.

## 6పత్తు 2తిరువాయ్ మొళి" మిన్నిడైమడవార్" సారాంశము.

66.తావ ద్విలంబ మసహ ప్రణయేన రోషా
త్కృష్ణం సమాగత మపి త్వరయా వినింద్య
తేన స్వసంగమమనోరధినా ద్వితీయే
సాంత్వోక్తిభి స్సమనువీయ సమాహితోభూత్॥

తా॥ఆళ్వారులు ఈ రెండవ దశకమునందు అతికొద్ది ఆలస్యమును కూడ సహించనివారై ఆలస్యముగా వచ్చిన శ్రీకృష్ణుని మిక్కిలి ప్రేమచే కలిగిన కోపముతో నిందించి,తమతో సంశ్లేషించుటకు ఆశపడిన అతనిచే బుజ్జగించబడి మధురోక్తులచే ప్రణయరోషము తొలగించుకొనిరి.

## 6పత్తు 3తిరువాయ్ మొళి" నల్ కురవుమ్" సారాంశము.

67.కోపం మమ ప్రణయజం ప్రశమయ్య కృష్ణం
స్వాధీనతా మతనుతేతి సవిస్మయ స్సః
స్వీయాం విరుద్ధ జగదాకృతితాం చ తేన
సందర్శితా మనుబభూవ ముని స్తృతీయే॥

తా॥శ్రీకృష్ణపరమాత్మ ఆళ్వార్ నాయకి ప్రణయకలహమును తన మృదుమధురోక్తులతో ఉపశమింపచేసి స్వాధీనపరచుకొనెను.ఆళ్వారులు ఆశ్చర్యపడి శ్రీకృష్ణునిచే చూపించబడిన తన పరస్పర విరుద్ధమైన శరీరభూతమగు జగదాకృతిని అనుభవించిరి.ఇదిఅంతయు భగవంతుని ప్రభావమే.ఈ విషయమే మూడవ దశకమున వివరించబడినది.

## 6పత్తు 4తిరువాయ్ మొళి" కురవై" సారాంశము.

68.ఆనందశీతలిత వాగను సందధీయ
కృష్ణస్య వీర్యచరితా న్యహ మాదరేణ
ఇత్థం పురా స్వయ మపేక్షిత వాన్మని
స్తలబ్ధ్వా సమోస్తి మమే త్యవద చ్ఛతుర్థే॥

తా॥భగవదనుభవానందముచే నమ్మాళ్వారుల సంసారతాపము అణగిపోయినది.వాక్కు చల్లబడినది.శ్రీకృష్ణ దివ్యగుణచేష్టితములను ప్రీతిపూర్వకముగా అనుసంధించవలెనని పూర్వము వారు కోరిన కోరిక ఇప్పుడు లభించగా ఇక తమతో సమానమైన ధన్యుడెవడు లేడని ఆళ్వారులు తమ ఆనందాతిశయమును ఈ నాలుగవ దశకమున అనుగ్రహించినారు.

## 6పత్తు 5తిరువాయ్ మొళి" తువళిల్" సారాంశము.

69.తస్యాపి మానసతయానుభవస్య
బాహ్య సంశ్లేషణైక పర చిత్తమనశ్శరీరః
ఆత్మానురక్తజన మాత్మని నిస్పృహత్వం
నిన్యేధి పంచమ మతి ప్రవణోచ్యుతే సః॥

తా॥ఆళ్వారులు మానసికముగా భగవదనుభవము లభించినప్పటికి అంతటితో తృప్తిపడలేదు.బాహ్యేంద్రియములచే భగవంతుని అనుభవించి సంశ్లేషించుటయందు ఆసక్తి కలిగిన త్రికరణములు కలవారై భగవంతునియందే అత్యంత ప్రవణులై తమయందు ప్రేమతోనున్న బంధుజనమును తమయందలి ఆశను వదలవలెనని ఈ దశకమున కోరిరి.

## 6పత్తు 6తి “మాలుక్కు” సారాంశము

70.తస్మాన్మునిః ప్రవణతా విభవాత్పరస్మిన్
పుంస్యేవ పుంఖితమతిః పురుషార్థసారే
స్వస్య స్వకీయవిషయే ష్వఖిలేషు షష్ఠే
స్వీయత్వబుద్ధి రవశా ద్గలితే త్యవోచత్॥

తా॥ నమ్మాళ్వారులు దేహబంధువులందరియందు నిస్పృహ వహించి భగవంతునియందే ప్రావణ్యము కలిగినవారై పరమపురుషార్థమునందు బుద్ధిని పెట్టిరి.వారు తమ ప్రయత్నము లేకయే మమకారత్వ బుద్ధి వదలివెళ్ళినదని ఈ ఆరవ దశకమున చెప్పినారు.

## 6పత్తు 7తిరువాయ్ మొళి” ఉణ్ణుంశోరు” సారాంశము.

71.కృష్ణే న ధారయిత పోషక భోగ్య యోగీ
ప్రాప్తావతి త్వరితధీ రఖిలా న్విహాయ
స్యాదప్యలబ్ధఫల ఇత్యవహీయమానః
పార్శ్వస్థితై ర్మని రభూ దధిసప్తమం సః॥

తా॥ఈ దశకమునందు ఆళ్వారులు శ్రీకృష్ణుడు ధారక పోషక భోగ్యభూతుడని చెప్పిరి.అట్లు విశ్వసించి సాంసారిక విషయములను వదలిపెట్టి భగవంతుని బాహ్యసంశ్లేషమును తమకు కావలెనని త్వరపడుచున్న మనస్సు కలవారైరి. ఆ ఫలము లభించనందున ఆళ్వారుల ప్రయత్నము ఫలించునో ఫలించదోయని శ్రీవైష్ణవులు దుఃఖించుచున్నారని కూడ ఇక్కడ తెలిపియున్నారు.

## 6పత్తు 8తిరువాయ్ మొళి" పొన్నులగాళీరో" సారాంశము.

72.అప్యేవ మాత్మ ఫలదాన విలంబవంత
మాలోక్య శౌరి మథ యత్ర చ కుత్రచాపి
ఆవేద్య మత్స్థితి మధీనవిభూతి యుగ్మ
స్స్వతే త్యయాచత నతో ముని రష్టమేన॥

తా॥ఈ దశకమున ఆళ్వారులు భగవంతుని ఆశ్రయించినప్పటికిని ఫలమును ఇచ్చుటలో ఆలస్యముచేయునని ఆలోచించి

వెంటనే ఏదైనా దివ్యదేశమునకు వెళ్ళి స్వామికి తమ దీనస్థితిని తెలిపి ఉభయ విభూతులను బహుమతులుగా పొందమని భాగవతోత్తములను అర్థించిరి.

## 6పత్తు 9తిరువాయ్ మొళి" నీరాయ్ నిలనాయ్" సారాంశము.

73.ఆలోకనేపి విషయస్య భృషం విభగ్నో
రూపే హరే స్సకలలోకమయే నిరాశః
అప్రాకృతే వపుషి లోలమనాప్తముచ్చైః
రాకారయ త్ప్రలపితై ర్నవమే శఠారిః॥

తా॥నమ్మాళ్వారులు ప్రాకృత విషయములను మిక్కిలి నిరసించి శిథిలమనస్కులై భగవంతునకు శరీరభూతమగు చిదచిదాత్మక సర్వప్రపంచ సందర్శమునందును కోరిక లేనివారై ,పంచోపనిషణ్మయమైన భగవంతుని దివ్యమంగళ విగ్రహ సందర్శనమునందు దృఢచిత్తులై భగవంతుని గూర్చి ఎలుగెత్తి దీనోక్తులను పలికిరని ఈ తొమ్మిదవ దశకము తెలియచేయుచున్నది.

## 6పత్తు 10తిరువాయ్ మొళి" ఉలకముండపెరువాయా" సారాంశము.

74.ఆర్తే స్తథా గతతయా ముని రబ్జవాసా

మాశ్రిత్య సంఘటన కర్మణి జాగరూకామ్

ఆవేద్య చాధిదశమం స్వ మకించనత్వం

శ్రీవేంకటేశచరణౌ శరణం ప్రపేదే॥

తా॥ఆళ్వారులు ఈ పదవదశకమునందు చెప్పుటకు అలవికాని అత్యంత దుఃఖముతో భగవంతునితో తప్పక చేర్చునట్టి పురుషకారము చేయుటలో సిద్ధముగానుండు లక్ష్మీదేవిని పురుషకారము చేసుకొని తమ అకించన్యత్వమును విన్నవించి శ్రీవేంకటేశ్వర స్వామి దివ్యశ్రీచరణారవిందములనే ఉపాయముగా పొందినారు.

భగవద్రామానుజ స్వామి ఆళ్వారుల భక్తిసిద్ధాంతమునే ప్రతిపాదించినారు.

## 7పత్తు 1తి" ఉణ్ణిలావియ" సారాంశము.

75.ఆద్యే ముని స్స శతకస్య తు సప్తమస్య

తస్మిన్నపి ప్రపదనే విఫలే నిషణ్ణః

ఈశేన పాతిత మివ స్వ మవేక్ష్య గర్తే

తస్మై స్వభీతి మవద ద్విషయేంద్రియేభ్యః॥

తా॥నమ్మాళ్వారులు క్రిందటి దశకమున లక్ష్మీదేవిని పురుషకారము చేసుకొని శరణాగతి చేసినప్పటికి మనోరథము సిద్ధించలేదు.ఈ దశకమునందు ఆళ్వారులు ఎంతో విచారించి భగవంతుడే తనను అధఃపాతాళమునందు పడవేసెనని తలచి భగవంతునకు విషయములవలనను,విషయములను గ్రహించు ఇంద్రియములవలనను తమకు కలిగిన భయమును ప్రకటించినారు.

7పత్తు 2తి" కంగులుమ్ పగలుమ్" సారాంశము.

76.ఆత్మప్రబంధ మసమాప్య హితం జనానాం
ఆత్మేష్ట మకషమతయా హరిణా ప్రదాతుమ్
శ్రీరంగిణాప్యసుశక ప్రశమార్థచింతాం
భూయస్తరా మరతి మాపముని ర్ద్వితీయే॥

తా॥ఆళ్వారులు జనులకు హితకరమగు తమ ప్రబంధమును ముగించక,శ్రీరంగదివ్యక్షేత్రమునందు శయనించియున్న పెరియ పెరుమాళ్ళను ఆశ్రయించినను తన కోరిక నెరవేరకపోవుటచేచేయతగిన శాంతికి తగిన చింతనలు లేనివారై అపరిమిత దుఃఖమును పొందిరి.

7పత్తు 3తి" వెళ్ళైచ్చురిశంగు" సారాంశము.

77.శ్రీరంగభర్తు రశరణ్య శరణ్యభావ
ప్రస్తావలబ్ధ ధృతి రస్యగతౌ స భూయః
స్వస్మిన్ హితప్రియ పరేతర నిర్విశేష
మాసీ దవార్య బహులాభిరుచి స్తృతీయే॥

తా॥ఈ మూడవ దశకమున ఆళ్వారులు శ్రీరంగనాథుడు దిక్కులేనివారిని రక్షించుననెడి తల్లిగారు చేసిన ప్రశంసను విని స్వస్థత చెందినవారైరి.ఆ భగవంతుని పొందుటలో ఉపకరించు తల్లులు,సఖులు,ఇతర స్త్రీలు అను వ్యత్యాసము లేకుండ ఎవ్వరిచేతను నిషేధించుటకు వీలుకాని అపరిమితాభినివేశము కలవారైరి.

7పత్తు 4తి”  ఆజియెజ “సారాంశము.(ఇక్కడి జి అను అక్షరాన్ని zhi లాగా జ అక్షరాన్ని zha లాగా పలకాలి.)

78.ఆతన్వతా హిత మథాత్మ దశానురూప

మావిష్కృతా ననుపమాన పురుషోత్తమేన

ఆత్మాపదాన విభవా నతిలోభనీయా

నధ్యక్షయన్ శఠజి దన్వభవ చ్ఛతుర్థే ॥ ॥

తా॥ఆళ్వారుల అవస్థకు తగినవిధంగా హితమును చేకూర్చుచున్న సర్వేశ్వరుడు అప్రమేయమైన అభిలషించతగిన

తాను వివిధ అవతారములలో కావించిన అత్యంతాశ్చర్యకరములైన దివ్యచేష్టితములను ఆళ్వారులకు చూపించగా వారు యథేష్టముగా అనుభవించిరని ఈదశకము తెలుపుచున్నది.

7పత్తు 5తి”  కర్పార్”  సారాంశము.

79.ఆత్మైక రక్షణ పరానవతార హేతూ

న న్యాదృశా న్గుణగణా నవహాయ శౌరేః

అన్య త్కథం మతిమతా మవబోధనీయ

మిత్యాన్య పర్యమలునా దధి పంచమం సః ॥

తా॥సర్వజీవ సంరక్షణయే సర్వేశ్వరుని ప్రధాన వ్యాపారము.రామకృష్ణాద్యవతారములకు కారణము రక్షకత్వమే.ఆశ్రితరక్షకత్వాది విలక్షణమైన శ్రీమన్నారాయణుని గుణగణములను విడచి ఏ బుద్ధిమంతునకైనను భావించతగినది లేదని నమ్మాళ్వారులు ఈ దశకమున భగవదితరాసక్తిని నిరసించిరి.భగవంతునియందు ఆసక్తిని అనురక్తిని ,భగవదితర విషయములందు నిరాసక్తిని విరక్తిని పెంపొందించుకొనవలెనని తాత్పర్యము.

## 7పత్తు 6తి" పామరుమూవులకు" సారాంశము.

80.తాదృగ్గుణ ప్రవిశదానుభవ ప్రవృద్ధ
స్వాపేక్షితాభి రుచితార్తి మహార్ణవస్సన్
ప్రాప్యం శరణ్య మపి వీక్ష్య కదానుగ స్స్యా
మంఘ్రోర్యస్తవేతి విలలాప ముని స్సషష్ఠే॥

తా॥ ఐదవ దశకములో చెప్పినట్లు ఆళ్వారులు భగవంతుని దివ్యగుణములను ప్రత్యక్ష సమానాకారముగా మానసికానుభవముచే సాక్షాత్కరించుకొనిరి.దాని వలన బ్రహ్మాండమైన భగవదనుభవ బాహ్యానుభవ రుచి ఏర్పడినది.దానిచే వారు భగవంతుని గూర్చిన ఆర్తియందు నిమగ్నులై పరమప్రాప్యుడును,సర్వరక్షకుడునునగు శ్రియఃపతిని దర్శించి నీ చరణారవిందముల దాసుడనుగా ఉండువాడనుగా ఎప్పుడు కాగలనో అని నమ్మాళ్వారులు ఈ ఆరవ దశకమున ప్రకటించిరి.

ప్రతి జీవుడు సర్వేశ్వరుని శ్రీచరణారవింద దాసునిగా ఉండుటయే స్వరూపము.

## 7పత్తు 7తి" ఏజైయరావి" సారాంశము.

81.తత్రాప్యర్థితా నధిగమేపి చ భావనాయా
భూమ్నః పురస్థిత మివానన మచ్యుతస్య
ఆలోకయ న్నపి కరేణ న సంస్పృశన్ స
పీడా మవాప మహతీ మథ సప్తమేన॥

తా॥నమ్మాళ్వారులు ఈ దశకమున తాము కోరిన విధముగా శ్రియఃపతి యొక్క అద్భుతమైన దివ్య సౌందర్యాది అనుభవము లభింపకున్నను భావనాతిశయముచే ఆస్వామి దివ్య ముఖారవిందమును ప్రత్యక్షముగా దర్శించుచున్నవారై తమచేతితో తాకుటకు ప్రయత్నించి విఫలులై గొప్పదైన దుఃఖమును అనుభవించిరి.

## 7పత్తు 8తి" మాయావామననే" సారాంశము.

82.సంగం నివర్త్య మమ సంసృతిమండలే మాం
సంస్థాపయన్ కథమసీ త్యనుచోదితేన
ఆశ్చర్యలోక తనుతా మపి దర్శయిత్వా
విస్మారితః కిల శుచం హరిణాష్టమేన॥

తా॥స్వామి నమ్మాళ్వారులు ఈ దశకమున సర్వేశ్వరుని ఈవిధముగా ప్రశ్నించుచున్నారు.ఓ స్వామీ! నాకు ఈ సంసారమందలి రుచిని పోగొట్టికూడ,ఇంకను ఈ సంసారమునందే ఉంచితివే?ఇదేమి ఆశ్చర్యము?.అని అడుగగా భగవంతుడు ఇదియొక ఆశ్చర్యమా?పరస్పరవిరుద్ధ వస్తువులన్నియును నాకు శరీరముగాఉన్నవి.ఈ ఆశ్చర్యమును చూపి ఆళ్వారుల దఃఖమును తీర్చివేసిరి.

## 7పత్తు 9తి" ఎన్దైక్కుమెన్దై" సారాంశము.

83.పృష్టః ఫలం స్వవసతే రిహ దుశ్శకాయాః
స్వేన ప్రబంధ రచనాం ఫల మాహశౌరిః
అన్వేషు సత్స్వపి తదా స్వ మపేక్షమాణ
మప్రత్యుపక్రియ మముం నవమే జగన్ సః॥

తా॥ఈ తొమ్మిదవ దశకమున నమ్మాళ్వారులు సర్వేశ్వరుడగు శ్రియఃపతిని ఓ స్వామీ!నాకు శక్యము కాని ప్రపంచ నివాసమునకు ప్రయోజనమేమి?అని ప్రశ్నించగా స్వామి ఈ తిరువాయ్ మొళి దివ్య ప్రబంధ రచనయే ప్రయోజనమని సమాధానమిచ్చెను.అప్పుడు నమ్మాళ్వారులు స్వామీ! వేదవ్యాసుడు,వాల్మీకి,భూతం,సరశ్చ,మహదాహ్వయులను ముదలాళ్వారులు మొదలగు మహాప్రాజ్ఞులుండగా నాచే ఈ మహత్కార్యమును చేయించుకొనుచున్న మీకు ప్రత్యుపకారమేమియు చేయలేకున్నానని కృతజ్ఞతను ఆవిష్కరించినారు.

7పత్తు 10తి"  ఇన్బంపయక్క"  సారాంశము.

84.ఆనంద మాకలయితుం కమలాసఖస్య
సంశ్రావ్య తత్కరుణయా స్వకృతం ప్రబంధం
అర్థే తదాదరణశాలిని దివ్యదేశే
యాత్రా మనోరథ మసౌ దశమే చకార॥

తా॥శ్రీశఠకోప మునీంద్రులు శ్రియఃపతి యొక్క పరిపూర్ణానుగ్రహముచే తాము కృపచేసిన తిరువాయ్ మొళి దివ్యప్రబంధమును "తిరువాన్విళై"  అను దివ్యదివ్యదేశమునందు విరాజమానుడైయున్న భగవంతునకు వినిపించి ఆస్వామిని ఆనందింపచేయవలెనని అభిలషించినారు.దానికొరకై "తిరువాన్విళై"  దివ్యదేశ యాత్ర చేయవలెననెడు తమ సంకల్పమును ఈ పదవ దశకమున తెలియచేసినారు.

8పత్తు 1తి"  తేవిమారావార్"  సారాంశము.

85.ఆద్యేష్టమస్య శతకస్య యథేష్టసిద్ధి
మప్రాప్య ఖిన్నమతి రాశ్రితపారతంత్ర్యం
సర్వేశ్వరత్వ మపి శంకితవా ఇచ్చారి
రీశస్య తేన పున రేవ విబోధితశ్చ॥

తా॥ఈ దశకమున పరాంకుశమునీంద్రులు తమకు ఇష్టమైన రీతిలో భగవంతుడు లభించనందున దుఃఖము పొందిన మనస్సు కలవారై శ్రియఃపతియందు ఆశ్రితపారతంత్ర్యము,సర్వేశ్వరత్వము(నిరంకుశ స్వాతంత్ర్యము)అను రెండు పరస్పర విరుద్ధ ధర్మములు కలవా?అని అనుమానించిరి.అప్పుడు ఆ శ్రీమన్నారాయణుడే తాము చేసిన ఉపకారకములను జ్ఞాపకముచేసి ఆ రెండు గుణములు తమకు కలవని చెప్పగా ఆళ్వారులు ఉపశమనము పొందిరి.

## 8ప 2తి" నంగళ్ పరివళ్లై" సారాంశము.

86.సంప్రాపకేపి చ విభౌ నిజపాంఘ్రితార్థ

ప్రాప్తే ర్వ్యఘాత ఇతరేషు చ పాశలేశః

స్వస్యేతిశంకితమనా స్స్వవిహితేపి వర్గే

స్వస్మి న్నపి ప్రవణతాం ముముచే ద్వితీయే॥

తా॥ఈదశకమున ఆళ్వారులు తమకు ఇతరవస్తువులయందలి ఆసక్తి ఆశ ,తమకు కావలసిన పరమపురుషార్థము సిద్ధించుటలో విఘ్నము కలిగించునని ఆలోచించి,తమకు ఇతరవస్తువులయందుకల ఆసక్తిని ఆశను ,తమయందుకల అహంకార మమకారములను పూర్తిగా విడిచిపెట్టిరి.

## 8పత్తు 3తి" అంగుమింగుమ్" సారాంశము.

87.ప్రేమాధికేన వివశ స్సుకుమారమూర్తేః

క్షేమాయ ఖిన్నహృదయః పురుషోత్తమస్య

తద్దర్శితాత్మపరనిత్యముముక్షుముక్తైః

కించిత్సమాహితమనా శఠజి త్తృతీయ

తా॥ఈ దశకమున నమ్మాళ్వారులు శ్రియఃపతి యొక్క పరమ సుకుమారమైన దివ్య తిరుమేని క్షేమము కొరకు దుఖించుచున్నవారైరి.ఆ స్వామి యందు అత్యంత అనురక్తి కలిగి మంగళాశాసనము చేయునట్టి నిత్యసూరివర్యులను,ముక్తులను , ముముక్షువులను శ్రియఃపతి ఆళ్వారులకు చూపగా వారు కొంత ఉప శమనము పొందినారు.

8పత్తు 4తి" వార్ కడావరువి" సారాంశము.

88.క్షేమం స్వశౌర్య మధికం విమత్తై రధృష్యం
గ్రామం చ కంచన నిజావసధాయమానం
తత్ర ద్విజా నరిజిత స్స్వసమా న్ప్రదర్శ్య
నిర్భ్ర రకారీ నితరాం స ముని శ్చతుర్థే॥

తా॥" తిరుచ్చెంగనూరు" దివ్యదేశము అత్యంతమహిమాన్వితమైనది.అది క్షేమకరమైనట్టిది అపరిమితమైనట్టిది శత్రువులెవరు తేరిపారచూచుటకు అశక్యమైనది.పరాక్రమముచేత ఆక్రమించుటకు వీలుపడనిది.అది సర్వేశ్వరుడు శ్రియఃపతి నిత్యవాసము చేయునట్టి పవిత్రప్రదేశము.అచ్చటి శ్రీవైష్ణవోత్తములు శత్రువులను నిర్జించుటలో భగవంతునితో సమానమైన ప్రభావసంపన్నులు.భగవంతుడే ఈ దివ్యదేశమును అచ్చటి శ్రీవైష్ణవ భాగవతులను ఆళ్వారులకు దర్శింపచేసి వారి భయమును పోగొట్టెనని ఈ దశకమున సాయించిరి.

ఆళ్వారుల శ్రీసూక్తులు భక్తులకు అమృతమే అగును.ఆళ్వార్ దివ్యతిరువడిగళ్ శరణం.

8పత్తు 5తి" " మాయక్కూత్తా" సారాంశము.

89.సుక్షేమ సుందరతనుం పరిలిప్స్ రీశం
శోచ న్మని ర్గహనలూఢ ఇవాతితప్తః
ఏహ్యేవ మిత్యుపగతస్య బహుప్రకారా
నాఖ్యాయ శౌరి మధిపంచమ మాజుహావ॥

తా॥ఈ దశకమున ఆళ్వారులు పరమభాగవతోత్తముల మంగళాశాసనప్రభావముచే క్షేమంగా ఉన్నట్టి ,అద్భుత సౌందర్యరాశీభతమగు దివ్యమంగళవిగ్రహము కల శ్రీమన్నారాయణుని ప్రత్యక్షముగా అనుభవించుటకు ఆశపడినవారై దావాగ్నిచే చుట్టబడిన వారై మిక్కిలి తపించిరి. వారు భగవంతుని దివ్యాభరణ దివ్యాయుధ సమేతముగా వేంచేయుమని కోరుకొనిరి.అట్లే వేంచేసిన భగవంతుని యొక్క అనేక ప్రకారములను ఆళ్వారులు తెలియచేసి భగవంతుని ఆహ్వానించిరి.

## 8ప 6తి" ఎల్లియుమ్" సారాంశము.

90.సద్యః స్వసంగమకృతౌ భవితా న సాత్మ్య
ప్రీతి స్సమేతి హరి రాప్తుమనా శ్శనైర్మామ్
వైకుంఠతోధిగతవా న్మతిమిత్యవన్యాం
స్థానే క్వచి ద్బహుమతిః వితధే స షష్ఠే॥

తా॥ఆళ్వారులు మరొక అద్భుత విషయమును ఈ ఆరవ దశకమున తెలియచేయుచున్నారు.భగవంతుడైన శ్రియఃపతి ఆళ్వారులతో సంశ్లేషించుటయందు తమకు కలిగిన ప్రీతి ఇంతటితో సరిపోదని ఆళ్వారులను మెల్ల మెల్లగా పొందకోరినవాడై నిత్యవిభూతియైన శ్రీవైకుంఠము నుండి ఈ భూలోకమునకు వచ్చి "తిరుక్కడిత్తానం" అను దివ్యదేశమును వాసస్థానముగా చేసుకున్నారని నమ్మాళ్వారుల శ్రీసూక్తి.

## 8ప 7తి" ఇరుత్తుమ్" సారాంశము.

91.మద్విప్రయోగ మసహన్ స్వయమేవ చార్ధీ
మా మల్పకైకనిలయం బహుమన్యమానః
శౌరి స్సమాశ్లిష దిదం మతివిభ్రమః కిం
ఇత్యాత్మనో ముద మభాషత సప్తమేన॥

తా॥నమ్మాళ్వారుల విశ్లేషమును సహించలేక భగవంతుడు తానే స్వయముగా ఆళ్వారులను మహిమాన్వితుడుగా తలచి సంశ్లేషించెను.క్షుద్రుడైన తనతో భగవంతుడు సంశ్లేషించెనని తలచుట తన చిత్తభ్రమ కావచ్చునని ఆళ్వారులు ఈ ఏడవ దశకమున అనుగ్రహించినారు.

ఆళ్వారుల చిత్తభ్రమ వంటిది మనకు కలిగితే మనము ధన్యులము కాగలము.

8వ 8తి" కణ్ గళ్ శివందు" సారాంశము.

92.స్వాయోగ్యతా మతినివర్తన లోలుపేన

శ్రీకౌస్తుభేన కమలాస్తనతోపి తుల్యం

ఆత్మైకశేష మవబోదిత మీశ్వరేణ

స్వస్య స్వరూప మవద న్మని రష్టమే సః॥

తా॥సర్వేశ్వరుడగు శ్రియఃపతి ఎంతగా ప్రయత్నించినను నమ్మాళ్వారులు నైచ్యానుసంధానము చేసుకొని దూరముగా ఉంటున్నారు.దీనిని పోగొట్టతలచినవాడై భగవంతుడు ఆళ్వారుల స్వరూపమును కౌస్తుభమణితోను,లక్ష్మీదేవి స్తనద్వయముతోను సమానమని తనకు అత్యంత భోగ్యమైన శేషవస్తువని తెలియచేసెనని ఆళ్వారులు ఈ దశకమున అనుగ్రహించినారు.

శేషత్వ పారతంత్ర్యములు స్వరూపముగా కలిగిన జీవులు శ్రియఃపతికి కౌస్తుభము వంటివారే.

8పత్తు 9తి" కరుమాణిక్కమలై" సారాంశము.

93.అన్యార్థతాశ్రవణ మప్యథ శేషతాయా

స్సోఢుం న శక్యత ఇతి స్వదశావిశేషమ్

అన్యాపదేశ మవలంబ్య తదోపయుక్తం

నారాయణైక పరధీ ర్నవమే జగాద॥

తా॥ఈ దశకమునందు నమ్మాళ్వారులు తాము ఇతరులెవ్వరికి శేషభూతులను మాటను వినుటకైనను సహింపనివారై,శ్రియఃపతి శ్రీమన్నారాయణునియందే అత్యంత ప్రవణులై,భగవంతునియందే వినియోగపడు తమ అవస్థను అన్యాపదేశముగా అనుగ్రహించినారు.

8పత్తు 10తి" నెడుమార్కడిమై" సారాంశము.

94.తాం శేషతా మపి తదీయ తదీయసీమా
శేషత్వపర్యవసితాం పురుషార్థసీమామ్
ఆవిష్కృతాం భగవతా ముని రాత్మరుచ్యా
మాచష్ట ధిక్కృత తదన్య పుమర్థమన్యే॥

తా॥ఈ దశకమునందు ఆళ్వారులు భగవంతునిచేత ప్రకాశింపబడిన,తమకు భోగ్యమైన భగవత్ శేషత్వము కంటె భాగవత శేషత్వమే పరమపురుషార్థమని అనుగ్రహించినారు.

9ప 1తి" కొండపెండీర్" సారాంశము.

95.ఆద్యే చకార నవమే శతకే శఠారి
స్తచ్ఛేషతానుభవ సన్మతి సమ్మతేన
నిశ్చిత్య సర్వవిధబంధుతయా తమీశ
మాపత్సఖంప్రణమతేతి పరోపదేశం॥

తా ॥నమ్మాళ్వారులు ఈ దశకమున భగవచ్ఛేషత్వానుసంధానముచేయుటలో నిష్ఠులగు భాగవతోత్తముల యొక్క ఉపదేశప్రభావముచే సర్వేశ్వరుడు సకలవిధబంధువగుట చేతను,ఆపత్కాల ఉపకారకుడగు ట చేతను ఆయననే విశ్వసించి నమస్కరింపుడని పరోపదేశము చేసిరి.

9ప 2తి" పండ్రైనాళాలే" సారాంశము.

96.బంధుత్వతః స్వమనుకంపితవంత మాదా
వాసన్న ధామ్ని భుజగాధిపతౌ శయానమ్
ప్రాపేక్షితం ముని రయాచత తం ద్వితీయే
తస్యైక రూపశయనేపి చ దుఃఖితోభూత్॥

తా॥ఈ దశకమున నమ్మాళ్వారులు శ్రియఃపతి తమకు సర్వవిధ బంధువగుట వలన దయకలవాడై "తిరుప్పుళింగుడి" అను దివ్యదేశమునందు శేషునిపై శయనించిన స్వామిని తమ అభీష్టసిద్ధికై ప్రార్థించినారు.అక్కడనే అదేవిధముగా స్వామి శయనించుటను చూచి తిరుమేని అలసటచెందునా యని దుఃఖించిరి.

9ప 3తి" ఓరాయిరమాయ్" సారాంశము.

97.నారాయణే మయి సతి స్వభరార్థ చింతా
నార్హా తవేతి విభునా బహుమానభాజా
ఆవిష్కృతా న్నిరవధి న్నిజశీలవత్తా
మన్యాదృశీ మనుబభూవ ముని స్తృతీయే॥

తా॥ఈ దశకమున నమ్మాళ్వారులు శ్రియఃపతి శ్రీమన్నారాయణుడే నాకు సకలవిధ బంధువై "రక్షకుడై నేనుండగా మీకు మీరక్షణ విషయమైన చింత తగదు" అని భగవంతునిచే తెలియచేయబడిన ఆయన నిరవధికమైన ఆశ్రితవాత్సల్యమనెడు శీలగుణమును అనుభవించి సాయించిరి.

## 9ప 4తి" మైయార్ కరుంకణ్ణి" సారాంశము.

98.శీలాధిక శ్రియ మురస్థలతో దధానో
ప్యాత్మేప్సితం న దిశతీ త్యతిమాత్రఖిన్నః
లబ్ధ్వా తతః కమపి తస్య కృపా కటాక్ష
మద్రాక్ష మీశమితి స ప్రజహర్ష తుర్యే॥

తా॥ఈ దశకమున శ్రీశఠకోపమునీంద్రులు సౌకుమార్యము సౌలభ్యము సౌశీల్యము వాత్సల్యము పురుషకారము మొదలగు భగవన్నారాయణాభిమతానురూపమైన అసంఖ్యేయ గుణగణములచే అధికురాలైన మహాలక్ష్మిని వక్షఃస్థలమునందు ధరించినవాడైనను తన మనోరథమును ప్రసాదించుట లేదే?అని మిక్కిలి దుఃఖించిరి.అటుపిమ్మట ఆ శ్రియఃపతి యొక్క కృపాకటాక్షవీక్షణము లభించి శ్రీశ్రియఃపతులను సేవించితినని మహదానందమును పొందిరి.

## 9ప 5తి" ఎన్నుయిర్ చ్చేవలుమ్" సారాంశము.

99.ఆలోకనం చ త దచాక్షుష మి త్యథార్తో
దృష్ట్వా చ తత్స్మరణ హేతు పదార్థజాతమ్
ఆసన్నహానిక తయా వసిత స్సుసక్తో
దుఃఖేన దుస్సహతరేణ స పంచమేభూత్॥

తా॥ ఈ దశకమున నమ్మాళ్వారులు ఆ శ్రియఃపతిని ఆంతరమున దర్శించినట్లు బాహ్యచక్షువులచే దర్శించుట సాధ్యము కాదని తలచి ఆ స్వామిని జ్ఞాపకముచేయు కోకిలలు మొదలగు పక్షులను ఇంకను ఆయనను పోలిన వస్తువులను చూచి శరీరము పడిపోవునో అనునట్లు శైథిల్యమును పొందిరి.

అస్మద్గురుభ్యోనమః.అస్మత్ పరమ గురుభ్యోనమః.అస్మత్ సర్వ గురుభ్యోనమః

## 9ప 6తి" ఉరుకుమాల్ నెంజమ్" సారాంశము.

100.స్వస్యాత్మతా మగణయన్ స్వయ మర్థయిత్వా

స్వం ప్రాప్య హర్షవివశో హరి రిత్యధస్తాత్

య చ్ఛీల మన్వభవ దస్య తదేవ దైవాత్

సంస్మృత్య సద్రుతమనా వ్యసనీ చ షష్ఠే॥

తా॥ఈ దశకమున నమ్మాళ్వారులు శ్రియఃపతి యొక్క గొప్పదైన సౌశీల్యమనెడు గుణమును మాటిమాటికి తలచి అనుభవించి మనస్సు శిథిలమైనవారై దుఖించిరి.ఆళ్వారులు అనుభవించిన ఆ సౌశీల్యగుణవిశేషమేమనగా-భగవంతుడు ఆళ్వారులకు అంతరాత్మగా ఉండుట ఒక ఉపకారమని భావించక భగవంతుడే స్వయముగా తనకే ఉపకారమని ఆళ్వారుల హృదయములో ప్రవేశించి మిక్కిలి సంతోషించినాడట.

## 9ప 7తి" ఎంగానల్" సారాంశము.

101.స్వీయం వియోగిజనహ న్నృ నిజాభిరూప్యం

విస్మృత్య సంశ్రితజనైర్వసత స్సహైవ

అర్చాహరేః క్వచన తత్ర్పతి బోధనాయ

దూతీచకార విహగా నధి సప్తమం సః॥

తా॥ఈ ఏడవ దశకమున నమ్మాళ్వారులు జగన్మోహనాకారుడైన శ్రీమన్నారాయణుడు తనను విశ్లేషించియున్నవారిని చంపుచున్న తన తిరుమేని సౌంద్యమును మరచి ఆశ్రితులతో కూడి" తిరుమూజి(zhi)క్కడమ్" అను దివ్యదేశమునందు వేంచేసియున్న అర్చామూర్తికి ఆయన మరచియున్న ఆయన దివ్య సౌందర్యమును ఆయనకు తెలియచేయుటకు పక్షులను దూతలుగా పంపినారు.

102.ద్రమిడోపనిత్సంగతి.

ఈశే సమాజిగమిషత్యపి దూతవాక్యై

స్తావద్విలంబ మసహ న్మని రస్య మమ్ప్రౌ

దేవీజుషః కమపి దేశవిశేష మారా

ద్యాయాం కదే త్యవధి మార్థయ దష్టమేన॥

తా॥భగవంతుడు ఆళ్వారులు పంపిన దూతలగు పక్షులు చెప్పిన సందేశమును విని వారి వద్దకు వచ్చుటకు సంసిద్దుడగుచుండగనే,ఆమాత్రము ఆలస్యమునైనను సహింపక శ్రీ భూ నీళా దేవేరులతో కూడి భగవంతుడు అర్చాస్వరూముతో ఈలోకమున విరాజమానుడైయున్న "తిరునావాయ్" అను దివ్యదేశమునకు ఎప్పుడు వెళ్ళుదునా యని ఆళ్వారులు ప్రాప్తికాలమునకై ఈ దశకమున ప్రార్థించిరి.

9ప 9తి" మల్లికై" సారాంశము.

103.స్వప్రాప్తికాల మవిభావయతీందిరేశే

కృష్ణే గవా మవనధర్మిణి గోపికానాం

సాయం సమాగమవిలంబిని యోవసాదః

ఆసీ త్స ఏవ నవమే స్ఫురిత శ్శఠారేః॥

తా॥భగవంతుడగు శ్రియఃపతి ఆళ్వారులు తమను పొందు సమయము ప్రకాశింపకుండనుండుటచే,పశుపాలనమే ధర్మముగా కల శ్రీకృష్ణపరమాత్మ సాయంకాల సమయమున ఇంటికివచ్చుట ఆలస్యమగుచుంచుండగా గోపికలు పొందిన దుఃఖమును నమ్మాళ్వారులు ఈ దశకమున అనుభవించిరి.

9వ 10తి" మాలైనణ్ణి" సారాంశము.

104.ప్రాప్తిప్రదానసమయోయమితి ప్రకాశ్య
స్వస్య ప్రియం మహతి కృష్ణపురే వసంతం
ఈశం యదా శకన మాశ్రయతేతి హర్షా
దన్యోపదేశ మకరోద్దశమే మునీంద్రః॥

తా॥ఈ దశకమున శఠకోపమునీంద్రులు శ్రియఃపతి తమకు ప్రాప్తికాలమును తెలియచేసి "తిరుక్కణ్ణపురము" అను దివ్యదేశమునందు వేంచేసియున్నాడని అత్యంత ప్రియుడగు ఆసర్వస్వామిని యథావకాశము ఆశ్రయించుడని సర్వచేతనులకు సంతోషముతో పరోపదేశము చేసినారు.

10వ 1తి" తాళతామరై" సారాంశము.

105.ఆద్యేంతిమస్య శతకస్య మునిః స్వయాత్రాం
నిశ్చిత్య వర్త్మని సహాయ మపేక్షమాణః
ఆప్తం హితజ్ఞమహితచ్ఛిద మంబుజాక్షం
మోహూరధీశ మురవైరిణ మాశ్రయ త్సః॥

తా॥ఈ పదవ శతకములోని మొదటి దశకమున వకుళభూషణభాస్కరులగు నమ్మాళ్వారులు పరమపదయాత్రను నిశ్చయించి అర్చిరాది మార్గమునందు సహాయమును అపేక్షించినవారై ఇష్టప్రదాత,అనిష్టనివారకుడునగు ,తమకు పరమాప్తుడునై "తిరుమోహూర్" అను దివ్యదేశమునందు అర్చాస్వరూపముతో వేంచేసియున్న శ్రియఃపతి శ్రీమన్నారాయణుని ఆశ్రయించినారు.

## 10ప 2తి" కెడుమిడర్" సారాంశము.

106.వైకుంఠ మేత్య కరణీయ మశేషదాస్య
మత్రైవ కేవల మనంతపురే విధిత్సన్
ప్రాప్యత్వ మస్య దురితౌఘ నివర్తనం చ
ప్రాచీకశత్తనుభృతాం శఠజి ద్ద్వితీయే ॥

తా॥ఈ రెండవ దశకమున శ్రీశఠకోపమునులు నిత్యవిభూతియైన శ్రీవైకుంఠమునకు వెళ్ళి అచ్చట చేయవలసిన శ్రీశ్రియఃపతుల సమస్తకైంకర్యములను ఈ లీలావిభూతియందలి "తిరువనంతపురము" అను దివ్యదేశమునందు వేంచేసియున్న అనంత పద్మనాభ స్వామి వారికి చేయకోరువారై పరమాత్మ యొక్క ప్రాప్యత్వమును,సకల పాప నిర్మూలనాసామర్థ్యమును సకల జీవులకు ప్రకాశింపచేసినారు.

ఆళ్వార్ ఎంబెరుమానార్ జీయర్ దివ్యతిరువడిగళే శరణం.

## 10ప 3తి" వేయ్ మరుతోళ్" సారాంశము.

107.గోపీనియుక్త మపి గోచపలం వియుక్తం
దాస్యంత మప్యచిర మేవ హరిం నిజేష్టమ్
స్వోపేక్షకం త మతిశంక్య ముని స్స తేన
విస్రంభితో విపులతృష్ణతయా తృతీయే ॥

తా॥నమ్మాళ్వారులు తాముకోరిన ప్రకారము గోవిందుడు పరమపదమును అనుగ్రహించుటకు సిద్ధపడినప్పటికి,గోపికలతో అత్యంత సంశ్లేషము పొందియున్నవాడైనను అతనిని గోవులయందాసక్తి కలవాడుగాను,తమనుండి విడిపోయినవాడుగాను,తమపట్ల ఉపేక్ష వహించిన వానినిగాను శంకించియుండెను.అప్పుడు ఆ గోవిందుడు మిక్కిలి అనురక్తుడగుటచే ఆగోపిక శ్రీకృష్ణుడు తనతోనున్నను అతడు తెలతెలవారుటచే గోవులను మేతకు తోలుకొనిపోవుచున్నాడని భ్రమించి విలపించుచుండగా ఆ గోపికను ఆ గోపాలుడెట్లు సమాధానపరచెనో అట్లే తమను సమాధానపరచెనని ఆళ్వారులు ఈదశకమున తెలియచేసినారు.

10ప 4తి"  శార్వేతవనెఱి"  సారాంశము.

108.ఆసక్తి నిశ్చయయుతః స్వఫలాగమస్య
స్వార్థా త్పరార్థపరధీ రనుకంపయా సః
ఉజ్జీవనాయ జగతా ముపదిష్టపూర్వాం
భక్తిం హరౌ ఫలయుతాం నిజగాద తుర్యే॥

తా॥ఈ దశకమున తాము అభిలషించిన భగవత్ప్రాప్తి అతి శీఘ్రముగా లభించునని దృఢముగా నిశ్చయించుకొనిరి.ఆళ్వారులు పరమదయార్ద్ర హృదయము కలవారు స్వప్రయోజనము కంటె పరప్రయోజనము కోరుకొనువారగుటచే సకల చేతనోజ్జీవనార్థమై మొదట ఉపదేశించిన విష్ణుభక్తిని ఫలవంతమగునట్లు ఇచ్చట ఉపదేశించుచున్నారు.

10ప 5తి"  కణ్ణన్ కజలిణై"  సారాంశము.

109.కృష్ణస్య పాదయుగళం ప్రతిభావనీయం
జిజ్ఞాసితం జగతి భక్తిసముత్సుకానాం
ప్రాప్తౌ త్వరాతిశయవాన్ మితసూక్తిజాలైః
భక్తే శ్శరీర మపి పంచమతో జగాద॥

తా॥నమ్మాళ్వారులు ,పరమపదప్రాప్తియందు త్వరకలవారై శ్రీకృష్ణ దివ్యపాదారవిందములగూర్చి చేయవలసిన భక్తిప్రపత్తులను లోకమున భగవద్భక్తియందాదరము కలవారలు తప్పక తెలుసుకొనవలసిన సమగ్ర భక్తిస్వరూపమును సంగ్రహ శ్రీసూక్తులతో ఈ ఐదవ దశకమున అనుగ్రహించినారు.

## 10ప 6తి" అరుళ్ పెరువార్" సారాంశము.

110.వైకుంఠధామని వివేశయిషుం స్వమీశం
తచ్చ స్వకీయవిధినైవ విధాతుకామమ్
పశ్య న్మునిః ప్రముదితోనుబభూవ షష్ఠే
వాంఛాధికాః స్వవిషయోపకృతీ స్తదీయాః

తా॥ఈ దశకమున ఆళ్వారులు తమను పరమపదమునందు ప్రవేశింపచేయువాడు,ఆళ్వారుల నియమనానుసారమే చేయతలచినవాడైన శ్రియఃపతిని దర్శించి మహదానందమును పొందినవారై,ఆ సర్వేశ్వరుడు తమ కోరికకంటె మించిన ఉపకారములను తమకు చేయుచున్నారని తెలియచేసినారు.

## 10ప 7తి" శెంజొళ్ కవిగాళ్" సారాంశము.

111.అస్మిన్ను పైమ్యము మితి స్వశరీరలోల
తద్దోషముగ్ధ మపి తత్త్యజనే స్వయాచ్ఞామ్
సార్ధాం చికీర్షు రధిగమ్య హరించదీయే
శీలే ముని స్స ఖలు!సప్తమతో మమజ్జ॥

తా॥నమ్మాళ్వారుల శరీరమునందాసక్తి కలవాడై అందలి దోషములనుకూడ భోగ్యములుగా భావించి ఆశరీరముతోనే వారిని పరమపదమునకు తీసుకొని వెళ్ళవలెనని శ్రియఃపతి సిద్ధపడెను.

అప్పుడు ఆళ్వారులు అట్లుకాదని శరీరమును విడిపించి మాత్రమే పరమపదమునకు వేంచేపుచేసుకొనుమని ప్రార్థించినారు.భగవంతుడు దానికి సమ్మతించగా ఆళ్వారులు భగవంతుని స్వభావమున నిమగ్నమైనట్లు ఈదశకమున తెలిపినారు.

## 10ప 8తి" తిరుమాలిరుంశోలై" సారాంశము.

112.వ్యామోహ మాత్మని విలోక్య విభో రవేల
మత్యాదరే మయి కథం త్వ మనాదరః ప్రాక్
హేతుం వదోచిత మిహే త్యనుపృచ్ఛ్య చైనం
దత్తోత్తరో ముని రనేన న చాష్టమేభూత్॥

తా॥ఈ దశకమున నమ్మాళ్వారులు,శ్రియఃపతికి తమయందున్న ఆశ్రితవ్యామోహమును చూచి స్వామితో "నీవు నాయందు ఇంతవ్యామోహము చూపుచున్నావే!ఇంతవరకు ఎందుకని ఆలస్యము చేసితివి?తెలుపుమనగా ఆసర్వేశ్వరుడు దానికి బదులు చెప్పలేక తలను వంచుకొని కాలివ్రేళ్ళతో నేలను గోకుచు నిలచెను.

## 10ప 9తి" శూజ్ విశుంబు" సారాంశము.

113.సత్కార మధ్వని సురై రపి సన్నికృష్టే
ప్రత్యుద్గతం పరమధామ్ని జనైః స్తదీయైః
తత్రస్థితిం సుఖమయీం చ హరిప్రియాణా
మాసాదితో ముని రభూ న్నవమే శఠారిః॥

తా॥ఈ దశకమున ఆళ్వారులు,తమకు అర్చిరాది మార్గమునందు ఆతివాహికులచే చేయబడు సత్కారములను,పరమపదమును చేరిన తరువాత నిత్యులు ముక్తులచే చేయబడుచున్న ఆహ్వానోత్సవమును,బ్రహ్మానందము యొక్క అనుభవమును మానసికముగా పొందినవారైరి.

10ప 10తి" మునియే నాన్మగనే" సారాంశము.

114.తద్దర్శనం చ మనసైవ న చక్షుషేతి
భక్త్యాయుతః పరమయా భగవాన్ శ్శఠారిః
పద్మాజ్ఞయా భగవతః పరిహృత్య మాంద్యం
స్వాభీష్ట మచ్యుతపదం దశమే ప్రపేదే॥

తా॥తిరువాయ్ మొళిలోని చిట్టచివరి పదవ దశకమున శ్రీ నమ్మాళ్వారులు,తమకు ఇంతవరకు కలిగిన భగవద్దర్శనము మానసికమే కాని చాక్షుషమెప్పుడును కాకుండుటచే ఎంతో దుఃఖించారు.పరమభక్తిపరవశులై శ్రియఃపతిని సందర్శించి సేవించి ఓ స్వామీ!ఇక పరమపదమును అనుగ్రహించుటలో ఎంతమాత్రమూ ఆలస్యము చేయవలదు.అట్లు చేసినచో మహాలక్ష్మిపై ఒట్టు సుమా!అని నిర్బంధించి పరమపదమును పొందిరి.

**ప్రియ భాగవతోత్తములారా!అళకియ మనవాళ జీయర్ స్వామి వారు అనుగ్రహించిన" ద్రమిడోపనిషత్సంగతి" ( తిరువాయ్ మొళి సంగ్రహసారాంశము)ని యథామతి మీకు సమర్పించాను.సారాసార విచక్షణశీలురైన పెద్దలు తిరువాయ్ మొళి సారాంశమును ఆమోదించకలరని ప్రార్థన.**

ద్రమిడోపనిషత్సంగతి సమాప్తము.
శ్రీమతే రామానుజాయ నమః